# స్మశానం చిగిర్చింది

బాలచంద్రయ్య ఏడవలేదు. కళ్ళ నీళ్ళుకూడా తిరగలేదు. కొడుకు శవం చూస్తూ నిలబడిపోయాడు- శిలా ప్రతిమవలె. ఆదిశేషు వచ్చి చచ్చిపోయినవాడి తల ప్రక్కన కొత్త ప్రమిదలో దీపం పెట్టి దానిమీద బుట్ట బోర్లించటంగూడా గమనించలేదు. హంపి శిథిలాల్లో నిల్చిన తలలేని రాతి చెక్కడంవలె వున్నాడు– దుప్పటి కప్పుకొని శాశ్వతంగా నిద్రిస్తూన్న కొడుకు ముందు.

కళేబరం మీది ముసుగును చీల్చుకొని, అతని కళ్ళు ఆరడుగుల ఆజానుబాహువు,—కొడుకు గుండెలమీది కత్తిపోటును పరికిస్తున్నై. ఆ చూపులో భావంలేదు. ఆవేదన లేదు. చైతన్యం ఒక్కటే గుప్తమై కనిపిస్తున్నది.

చచ్చిపోయిన సుబ్రమణ్ణెం గుండెమీది గాయం లోతుగా వుంది; నెత్తురు ద్రవించటం లేదుగాని, నోరులేని దుఃఖం నిశ్శబ్దంగా ప్రవహిస్తున్నది. ఎర్రగా విప్పారిన మందార పువ్వు-సాంబయ్య పెట్టిన గాయం!! ఆరడుగుల మనిషిని, చెట్టంత నిండు జీవాన్ని, ఒక్క కొడుకును–చంపిన సాంబయ్య!!!

బాలచంద్రయ్యకు కొడుకు ఛాతీమీదిగాయంలో సాంబయ్య కనిపిస్తున్నాడు. రెప్పలార్పకుండా హంతకుడు సాంబయ్య- నల్లటి విగ్రహాన్ని, క్రౌర్యానికి, మోసానికి చిహ్నాలుగా మెలిదిరిగిన కోరమీసాల్ని పరీక్షిస్తున్నాడు. భావాలూ, బాధలూ వెలిబుచ్చని చైతన్యం అది.

*　　　*　　　*

బాలచంద్రయ్యకు బలవంతపు చావులు చూసి భరించటం కొత్తగాదు. పాతికేళ్లకిందట భార్య కానుపు నొప్పులు నాలుగురోజులు విన్నాడు. ఐదోరోజున సీతమ్మ మంచానికి కరుచుకొని నెత్తురుమడిలో కనిపించింది. అప్పుడే పుట్టి చచ్చిన నెత్తురు గుడ్డును చాకలిమంత్రసాని చూపించింది. అప్పుడు తను లబోదిబో కొట్టుకొన్నాడు. నెలరోజులు లంకణాలు చేశాడు జబ్బుపడి.

సీతమ్మ చావునాటికి సుబ్రమణ్ణానికి మూడేళ్ళు.

పెళ్లాంచచ్చి రెండోసాలు తిరక్కముందే కూతుర్ని అల్లుడు ఏలుకో నన్నాడు. ఆ దిగులుతో లక్ష్మి భావిలో దూకి ప్రాణం తీసుకొన్నది. రాత్రిం బగళ్ళు వాపోయాడు. లక్ష్మి తిరిగి రాలేదు.

కాని సుబ్రమణ్ణెం అప్పటికే చిలిపిమాటలనటం నేర్చుకొన్నాడు. జీవితం వుంటే ఆశలు వుంటాయి. ఆశలకు రూపాలూ, కలలూ వుంటే-వాటికి మూర్తిగా ముద్దుల కొడుకు నిలిచాడు. ఆ కొడుకుకోసం బతికేడు. ఆకొడుకు కోసం సీతమ్మను మరిచిపోయాడు. ఆ కొడుకుకోసం లక్ష్మిని తలవలేదు. ఆ కొడుకు కోసం దయలేని అల్లుడితో జగడానికి పోలేదు.

కొడుకు గుండెలోతులో, సీతమ్మ పసుపూ, కుంకమా వంటినిండా పులుముకొని కనిపించింది. కొడుకు గుండె లోతుల్నుండి, భావిలో గుక్క తిర గక మునుగుతూ మునుగుతూ లక్ష్మి అరిచిన అరుపులు వినిపించినై. మళ్ళీ ఎనుబోతును మించిన సాంబయ్య......వాడి ఎర్రటి గుడ్లూ......

కాని బాలచంద్రయ్యకు ఏడుపు రాలేదు. కొడుకు దుర్మరణంచూసి తండ్రి కళ్ళలో నీళ్ళు ఎండిపోయినై.

*　　　*　　　*

సాయంత్రానికి మునసబు వచ్చిపోయాడు. మునసబు కేసులేదన్నాడు — కేసుల సంగతి బొత్తిగా తెలీదు బాలచంద్రయ్యకు. జీవితం అన్ని చిక్కుల్ని ఆహ్వానించి ఎరగదు.

వెదురు బొంగులు చీల్చి ఆదిశేషు పాడెగట్టేడు. దానిమీద యింత తులసి దుబ్బు పరిచాడు. పానకం సెట్టి బట్టల దుకాణానికి పోయి మూడు గజాల సైను తెచ్చాడు. శవాన్ని తడికెకు ఆనబెట్టి బుంగలతో నీళ్ళు తెచ్చి పోశాడు. చివరకు యిద్దరూ కలిసి ఆరడుగుల సుబ్రమణ్ణాన్ని, మందార పువ్వును మించిన గాయాన్ని, పాడెకు అంటగట్టేరు. పైన సైనుపంచె కప్పారు. సుబ్రమణ్ణెం సైనంటే పడి 'సచ్చే' వాడు.

స్మశానానికి ఎవ్వరూ రాలేదు. వచ్చిందల్లా ఆదిశేషు బావమర్ది అప్పలనర్సు ఒక్కడే. సాంబయ్యంటే అంత కర్కోటకుడు. అంత కంటకుడు. అంత నిరంకుశుడు. "సుబ్రమణ్ణెం పీనిగమీద చెయ్యేసినవాడు యీ భూమ్మీద నూకలకు ఆశలొదులు కోవాల్సిందే" నని వూళ్ళో చాటింపు జేయించాట్ట. సాంబయ్యను పెంచినపల్లె, సాంబయ్యను తెలిసిన వూరు గనక—ప్రాణంమీద ఆశగల వాడెవడూ పాడెకొమ్ము బట్టలేదు. పడదామనుకొన్న జాలిగుండె గలవాళ్ళందరికీ తమ వాములదొడ్లూ, పెద్ద మనుషులైన తమ కూతుళ్ళ మానాలూ స్మృతికి వచ్చినై. ప్రగతిలేని ఆ గ్రామీణ జీవన వాతావరణం మీద ప్రభుత్వపు న్యాయస్థానాల నీడలు గూడా పాకలేవు. పాకినా సంఘద్రోహులను మరుగు పరచగల భయంకరమైన కోరలు దానికి లేవు.

అప్పలనర్సూ, ఆదిశేషూ—చిన్నతనపు కోతికొమ్మచ్చుల దినాలు మరిచిపోలేదు. బాల్యస్నేహితుణ్ణి అవ్యక్తపు వీడ్కోళ్ళతో ఉత్తర దిక్కుకు మోశారు.

* * *

బండెడు కట్టెల్లో సుబ్రమణ్ణెం కాలేటప్పటికి చుక్కబొడిచింది. గుండె మీద కట్టె బెట్టబోయే ముందుగూడా కొడుకు గాయం ఆకాశమంతై అగుపించింది బాలచంద్రయ్యకు. అందులో సాంబయ్య తాగుబోతు అడుగులతో నృత్యం జేస్తున్నాడు. లక్ష్మి బావిలో మునిగిపోతోంది. సీతమ్మరక్తపు మడుగులో నిద్రిస్తోన్నది.

చుక్కబొడిచింది. మూగ వెన్నెల్లో రాజుకోలేని అంత్య కాష్టాల వెలుగు వెలా తెలా పోతున్నది. దూరాన రక్తమాంసాలు లేని మనుషులవలె నక్కలు కొరుకుతున్న పుర్రెలు కదులుతున్నాయి. బాలచంద్రయ్య నిరక్షర కుక్షి. వేదాంతి అసలే కాడు. కాని స్మశానం నలుదిక్కులా చూశాడు. సంక్రాంతి నెలలో వరిపొలాల కళ్ళం కాదది. కాని కొత్తధాన్యం లాగా అన్ని వేపులా బూడిద కనిపించింది—వేదాంతి కాని బాలచంద్రయ్యకు. తొలికోడి కూతకు చెట్లచాటున గుడ్లగూబలు మేల్కొని స్మశానపు నిశ్శబ్దాన్ని భంగం చేశాయి.

* * *

ఇల్లు జేరేటప్పటికి గుమ్మంముందు నాగరత్నం కూర్చొని వుంది. నాగరత్నం ఆదిశేషు మరదలు. తనకు కాబోయే కోడలు.

"మాఁవాఁ!"

నాగరత్తం కళ్ళు మెరుస్తున్నె అశ్రువుల్తో—మసక చీకట్ల ముందు. నాగరత్తానికి బావ యిక లేడు.

ఆ పిలుపుకు ఏ లోకంనుండో మేల్కొని యీ లోకానికి వచ్చాడు బాలచంద్రయ్య. నాగరత్తం తలమీద చెయ్యి వేశాడు ఏ ప్రయత్నమూ చెయ్యకుండానే. జుట్టు నిమిరాడు. ముంగురులు సరిదాడు. గడ్డం పుణికాడు. అమె వేడి కన్నీళ్లు తన చేతిమీద పడ్డె. నిశ్శబ్దంలో నిశ్శబ్దమయిపోయినాడు.

"బావను పంపి...వచ్చాను..." వృద్ధుడి కంఠం వణికింది.

నాగరత్తం తలెత్తి చూసింది. గుండె పెకల్చుకొని గొంతులోకి వచ్చింది.

"మాఁవాఁ! బావ నా కోసం...చచ్చాడు..." ఇక నాగులేరు ఆగలేదు. గుండ్లెకమ్మవలె వరదలయింది. చంద్రవంకవలె పొంగింది. అఖండ గోదావరి వలె అలలతో వూగింది. కృష్ణమ్మ లోతులు చూసింది. నాగరత్తం ఎక్కిళ్లు ఆపుకోలేక పోయింది.

* * *

నాగరత్తం అంత చక్కటి పిల్ల. ముక్కుపుడక దగ్గిర్నుండి కాళ్ళ కడియాలదాకా తీర్చి దిద్దిన బొమ్మ. పదిహేడేళ్ళ వర్షాలు పొంగి, నిండు పమిటె వెనక దాగుడుమూత లాడుతూ, సుబ్రమణ్ణెం బావను బెట్టిన కిత కితలు?? బావ తన మెళ్ళో మంగళసూత్రం గట్టినట్టు రాత్రికలగని ప్రొద్దున్నే బావకాడికి ఒక్క గంతులో వచ్చి, సిగ్గుపడి, కలసంగతి చెప్పలేక, చిలిపి కళ్ళతో మాట్లాడించి, బావ మెలిదిరిగిన నల్లకండరాలు చూసి, తనకు తాను మరిచిపోయి, తిరిగి వచ్చినంతలోనే మాయమైపోయే నాగకన్య. ఊళ్లో ఎల్లమ్మదేవత జాతరకు బావ కుట్టించిన వూదా "రెయికె" యెంత ముద్దుతో దాచుకొన్నది. మెరప తోటలో 'దచ్చినమ్మూల' నాగుబాముపుట్ట వెనక నక్కి "బావా!"—అని దిశలు శివా లెత్తినట్లుగా పిలిచి బావచేత వెతికించుకోటం. అవి భూలోకపు రోజులు కావు. దేవతా దినాలు. నాగరత్తానికి అంత ఆలోచన! అనుకొంటున్నది—'ఏటోక పున్నం' వెళ్ళిన పంచమినాటికి 'పెల్లి లగ్గం' కుదిర్చారు. ఇంకొక్క పదిరోజులు...పది!! పెళ్ళిలో తనకు చదివిం చేందుకు బావ పట్నం వెళ్ళి, మొన్న బేస్తారం తెచ్చిన కాసులు...నాలుగు బంగారం కాసులు...బావమొల్లో దాచుకొన్న నాలుగు కాసులు...మొన్నటి బేస్తారం. ఇంకా పది రోజుల్లో లగ్నం......నాగరత్తానికి సన్నాయి

స్వరాలూ, డోళ్ళు ప్రతిధ్వనించి చింత తోపుల్లో వినిపించిన శబ్దం, తోర ణాలూ, పసుపు గుడ్డల బావా, తలంబ్రాలూ కళ్ళముందు, చెవుల్లోనూ చిందులు తొక్కినై.

బాలచంద్రయ్య మెల్లగా దగ్గినాడు; మరుక్షణంలో నాగరత్నం కాల్ప నిక జగత్తు మారిపోయింది. ......బావ మాయమై, ఈ పృధ్వినుండి తొలగి పోయాడు. బావ తెచ్చిన కాసుల్ని మాత్రం తన చేతిలో చూసుకొన్నది— నాగరత్నం.

* * *

నాగరత్నం వెళ్ళబోయేముందు. మళ్ళీ దగ్గరకు చేర్చుకొన్నాడు. బలం లేని చేతుల్తో బాలచంద్రయ్య.

"అమ్మా...ఆమాట ఆదిశేషుకు జెప్పేవు గనక..."

ఆమె వృద్ధుడి కళ్ళల్లోకి చూసింది. శాంతమహాసముద్రపు గర్భంలో దాగిన విశాలత్వం...ఆకళ్ళలో బాధలగాధ నాగరత్నానికి అర్థం అయింది. మెల్లగా తలవూపింది.

తనమానం, తన గౌరవం :

తన బావను మీసం దువ్వించిన తన మానం: :

తన రేపటి ఆనందాన్ని, ముందు కలలనూ, తన కాసుల అనురాగాన్ని బూడిద చేసిన తన గౌరవం :

నాగరత్నం జీవంలేని కంఠం నుండి ఒక్కసారిగా పెనుకేక పెల్లగిలి వచ్చింది—

"మాఁవాఁ"

మామ అక్కడలేడు. మామ విశాలత, దూరదృష్టి మాత్రం ఆలోచన గల నాగరత్నానికి హత్తుకుపోయినై. బావ,—దుష్టసర్పం సాంబయ్య కాటుకు చచ్చాడు....నాగరత్నం మెదడు చీకట్లోకి పరుగెత్తింది. మామ తన అక్క అయిదవ తనం నిలపాలని అనుకొన్నాడు.

ఆలస్యమేలేదు—బానిసలై పుట్టి, వెలుగుచూడని జీవిత సంగ్రామంలో నలిగి, ఓడి, బ్రతుకుకోసం మాత్రమే బతుకుతున్న కోటాను కోట్ల భారత స్త్రీలలో... తానూ ఒక్కతై పోయింది చితికిపోయిన నాగరత్నం.

* * *

పెరుగూ విరుగూలేని గ్రామీణ జీవంలో శాంతిని న్యాయాన్ని నిర్మ లత్వాన్నిమాత్రమే చూసినట్లుగా భావించి భ్రమించే మూర్ఖుల్ని మరిచిపోతేనేం?

సాంబడి విషనేత్రాలు నాగరత్నంమీద వున్నవని సుబ్రమణ్ణెంకు చాలా రోజుల్నుండి తెలుసు. తల్లిదండ్రుల్లేనిపిల్ల తాను ఏ గడ్డికిపోయే డొంకదారిలోనో కాచి, వచ్చిపోయేటప్పుడు సాంబయ్య చిలిపి మాటలనటం, తను తిట్టి మెటికెలు విరవటం ఎన్నిసార్లు దాచినా బావకు తెలియక పోలేదు. తనకు ఆశ్చర్యం వేసేది—బావకెట్లు తెలిసిందో? అని—బావను తన ప్రేమతో కొని అంగ రక్షడిగా నియమించుకొన్న సంగతి మరిచిపోయింది. ఒకటి రొండుసార్లు బావతో సాంబడికి ఘర్షణ జరిగిందిగూడా. బావ బెదిరించాడు.

"అరె నీతిజాతిలేని తొత్తుకొడకా ... సిగ్గులేని ... యెదవా ... ఆడ దాన్ని..." సాంబడు కోరమీసం మెలికలు తిప్పేవాడు.

ఆదివారంనాడు తను వుత్తరంపొలంలో మోళ్ళేరుతున్నది. పొద్దుతిరగ్గానే మబ్బులేసినై. చినుకులు సాగకముందే యింటికి పోదామని అనుకొంటున్నది. వెనగ్గావచ్చి, ఎవరోకళ్ళు మూశారు. అరె, ఆచుట్టూ ఎవరూలేరే, ఇంతదూరానికి ఎవరూ రాబోరనీ, పెద్దమోళ్ళతో గంప నింపొచ్చనీ వచ్చింది తను.

సాంబయ్య!!! కళ్ళలో పశువులూ!!

"ఛీ...నీకు చెల్లెళ్ళులేరూ" అని విదిలించుకొని దూరంగా జరిగింది.

"ఇదుగో నాగూ...ఒక్కసారి..." బుగ్గకొరికాడు. తను కెవ్వుమని కేకేసింది. అడివి పందివలె మీదకొచ్చాడు.

"అన్నా...సాంబయ్యన్నా... నీకు అప్పచెల్లెళ్ళు..." ఇకిలించాడు—అడివి దున్న.

అదిమి...రెక్కలు విరిచాడు గట్టిగా. భయంతో కేకలేసింది. ఆతర్వాత తనకు తెలీలేదు బావ వచ్చిందాకా.

అర్జునుడివలె బావ వచ్చాడు. తను చూస్తుండగానే బావసింహమైనాడు. దూకి సాంబడిమెడ విరిచాడు. దుష్టుడు నేలబడ్డాడు మోళ్ళమధ్య. బావతన్ను లకు మూలిగాడు. లేచిపళ్లు కొఱికాడు.

తన మానరక్షణ బావగుండెమీద చెలియలి కట్టలులేని చెఱువుగా నిల్చింది మరుసటి నెలలోనే. చెలియలి కట్టలులేని చిన్న చెఱువు—నెత్తుటి చెఱువు!!

* * *

సాంబడికి, బావకూ మధ్యతగాదా అయిందని తెలిసినవాళ్ళు తనూ, ఘూ౹వా౹, బావ,..ముగ్గురే. నాగరత్నం అనుకొన్నది...యిద్దరేమిగిలారు...

వెంటనే కాసుల సంగతి జ్ఞప్తికి వచ్చింది. జ్ఞాపకాల దుఃఖంలో కాసులు తడిసి పోయినై.

* * *

జరజరా పొద్దు జాము...దాటింది-దానికి దుఃఖంతో కాలయాపనతో విరోధమైనట్లుగా, బాలచంద్రయ్య నిద్రపోలేక పోయినాడు. కాని కళ్ళు మూసుకున్నాడు — "స్మశానంలో మచ్చుకు గూడా యింత పచ్చిగడ్డిలేదు. అంత బూడిదలో తన సుబ్రమణ్ణెం గూడా భాగం పంచుకొన్నాడు...ఎంత గాయం ...బూడిద గుప్పిటకు వస్తుంది. ప్రాణాలు వదలబోయే ముందు (సీతమ్మకు) పచ్చిగడ్డి తెచ్చివేయమని చెప్పాడు..."

పచ్చిగడ్డి!

ఎవరో కొట్టి లేపినట్లు వులికిపడి లేచి దొడ్లోకి వెళ్లాడు. అరవై ఏళ్ళ బరువు కింద శరీరం వంగిపోతున్నది. కరువువచ్చి ముసలితనాన్ని మచ్చికచేసి పోయింది. దొడ్లో 'సీతమ్మ'కు మేతవేస్తూ, యీ లోకంలోని ఆనందాలతో సంబంధంలేని శోకదేవతలాగా నాగరత్నం వున్నది.

సీతమ్మ యీ భూమిమీద సుబ్రమణ్ణెం విడిచి పోయిన కోడెదూడ. సీతమ్మ ఆ యింటి స్వేదపు సొమ్ము. సుబ్రమణ్ణెం 'కస్తూరోరింట్లో' ఆరేళ్ల జేసిన కమతానికి తెల్లని బింబం. యింటి యిల్లాలు, చచ్చి పోయిన సీతమ్మ స్మృతి. అది ఆంధ్రదేశపు వ్యవసాయ కూలీల కుటుంబపు గర్వ చిహ్నం.

సీతమ్మ సీతమ్మే. మైసూరు కోడెల వాడి కొమ్ములూ, ఒంగోలు దూడల బిగువూ, దాని పాల వెన్నెల తెలుపూ, అహంకార పూరితమైన చూపులూ. కాని సీతమ్మ తోటిజాతితో జగడమాడి ఎఱుగదు. వేలెడు బుడతడి చర్మం గూడా రాచి యెరగదు. రవ్వంత గూడా కొమ్ము విసిరి యెరగదు.

అంత నాణ్ణెమైన సంతతి. అంతేనా? సుబ్రమణ్ణెం, కాబోయే 'సద్దకుడు ఆదిసేసు'తో 'జాయింటు యెగసాయం' బెట్టిన్నాటి నుండీ, భాగస్తుడి వట్టి బోయిన గేదెతోపాటు కాడి మెడకేసుకొని బెట్టలు దున్నింది. బురద నాగలి మోసింది. యిసుక విరిగిన బండిలాగింది. ఒక్కనాడు గూడా మారాం చెయ్య లేదు.

"సీతమ్మ గడ్డిపఱక కొఱకలేదు మాఁనాఁ"—

ఎక్కడో అగమ్యంలో చూస్తున్న బాల చెంద్రయ్య నాగరత్తం ముఖం మీదికి కళ్ళు తిప్పాడు. ఎంత అమాయకపు కళ్ళు! నాగరత్తం ముసిలివాణ్ణి ఎగాదిగా చూసింది. నిన్నా నేటికి యిరవై ఏళ్ళు కొని తెచ్చుకొన్నాడు.

బాలచంద్రయ్య సీతమ్మ పలుపు ఎత్తలేక పోయాడు.

"అయ్యో, కళ్ళ పుసిగట్టింది పిచ్చిముండకు." మోరమీద చెయ్యేసి నిమిరాడు. చేతులు కొమ్ముల మీదికి పోయినాయి. బాలచంద్రయ్యకు కొడుకు గుండెమీది గాయం స్మృతికి వచ్చింది.

* * *

సూదుల అప్పన్న ముసలివాణ్ణి కసిరి వేశాడు.

"కొడుకు జచ్చాడంట. తీరుపు జెప్పాలంట- హూఁ- పనికిమాలిన.... ముండల యెవారాల్లో జచ్చి గ్యామాన్ని పిసాచులై బట్టి...."

బాలచంద్రయ్య చెవులు మూసుకొన్నాడు. సుబ్రమణ్ణేన్ని ఎవ్వరూ అట్లానిందించలేదు. వాడిది మచ్చలేని బతుకు. సాంబయ్య కత్తిపోటుకు కొడుకు గుండెల్నుండి పొంగిన వేడినెత్తురు.... గష్‌గష్‌మని భూదేవిని తడపటం వినిపించింది.

ఆదిసేసు జెప్పనే చెప్పాడు. అప్పన్న సాంబడు మనిసని. ఊరిపెద్ద, గేమ పంచాయితీదారుడు.... అప్పన్న.

గౌళ్ళ నరిచిమ్ములూ, కేచమలు నాయుడు, బాలచంద్రయ్య క్షోభ విన్నారు.

"ఇదుగో చంద్రయ్యా...వాడా 'ఆసగాయ శూరుడు'—అప్పన్న జూడబోతిమా—?"

ఎవరు కూసినా అదే కూత. బాలచంద్రయ్య గడ్డమీద వుమ్మి వేశాడు —"ఇది వూరు గాదు, అడివి...." అన్నాడు.

చచ్చేటప్పుడు సుబ్రమణ్ణెం తన్ను గ్రామపెద్దల కాళ్ళు బట్టమని చెప్పలేదు. 'రగతం'లో కుడిచెయ్యి ముంచి, మీసం కాడికి చెయ్యిబోనిచ్చి "ఒరె, సాంబడా...మా అయ్య నిన్ను పాణాల్తో వదల్డ్రా" అని కవ్వించి, శపించి వచ్చాడు. ఆ వీరుడిని తనిక అవమానం చెయ్యదలచుకోలేదు.

* * *

సాయంత్రం యింత వేడిగంజి 'జర్మను సిలేవరి' గిన్నెలో పోసుకొని నాగరత్తం వచ్చింది. సీతమ్మ కొమ్ములకు పలుపుజుట్టి, శక్తిలేని చేతిలో కొసలు బట్టుకొని మామ నుంచొని వున్నాడు అరుబయట.

"మాంవాం!"—

"అవునమ్మా—యెళుతున్నాను— దిగులుబడ బోమాకు.... యిదుగో తాళం చెయ్యి- తిరిగొస్తానని ఆదిసేసుకు జెప్పు. అదుగో.... కళ్ళనీళ్ళు దుడుచుకో..."

చిక్కని గంజిపొరలమీద నాగరత్తం కన్నీళ్ళు తేలినై.— టార్పెడో దెబ్బకు మునుగుతూ అట్లాంటిక్ నీటిమట్టానికి పెట్రోలు గంధం పూసిన యుద్ధ నావలు. అట్లాంటి కన్నీళ్ళు.

* * *

సీతమ్మ దిగులు కొద్దిరోజుల్లోనే పోయింది. బాలచంద్రయ్య సీతమ్మ పాలచర్మంమీద ఈగ వాలితే కొదమ సింగం అవుతాడు. మట్టిరవ్వ అవుపించితే కొడుకు జ్ఞాపకం వచ్చి నొచ్చుకుంటాడు.

కొండవాలులో మంచి పచ్చిక వుంది. కిందనే సెలయేరు పారుతున్నది —ప్రపంచంలో ఎప్పుడూ యుద్ధాలు జరగనట్టే. కుడిచేతివాలుగా చిన్న అడివి— తన అందానికి అద్దాలు లేకుండా. ఈ రాజ్యమంతా సీతమ్మదై పోయింది.

అడివి ఆకులకూ, మోకాలి ఎత్తు పచ్చికకూ, కొండగాలికీ, సెలయేటి నీటికీ...సీతమ్మ బిగువునకు కొత్త మెఱుపు వచ్చింది. బాలచంద్రయ్య ముప్ఫై యేళ్ళు చిక్కిపోయాడు— ఆ మూడు నెలల్లోనే. సీతమ్మ మెళ్ళో మువ్వలు దూరపు కొండ లోయల్లో సంగీత నిస్వనాల్ని రేకెత్తించి సెలయేటి రొదలతో మిళితమై పోతాయి. కాని బాలచంద్రయ్య పెదిమలు కదపడు. కారెంపూడి యుద్ధ పదాలు పాడడు. నాయకురాలి దర్పగీతాలు, పలకలేడు. లవకుశుల ముచ్చట్లు తిరిగి రాగాలు తీయలేడు.

* * *

ప్రొద్దున్నే సీతమ్మ చెంగనాలు వేస్తున్నది. కదం తొక్కుతున్నది. వృద్ధుడి పెదిమలమీద చిన్న చిఱునవ్వు తొణికిసలాడింది. సీతమ్మ పిక్కమీద చఱిచాడు. వీపు నిమిరాడు. "నా సీతమ్మవు—" అన్నాడు. బదులుగా సీతమ్మ అవునన్నట్లే తలవూపింది. రంకెవేసింది. రణరంకె అది.

బాలచంద్రయ్య యిక ఆలస్యం చెయ్యలేదు. గుడిసెలోకి పరుగులెత్తాడు. నిలువుటెత్తు గడ్డిబొమ్మను లో నుండి తెచ్చాడు. అది పెద్ద దిష్టి బొమ్మ. దూరానికి నిజమైన మనిషిగా భ్రమింపజేయగల బొమ్మ. ఆరు రేయింబవళ్ళు వృద్ధుడు కష్టించిన బొమ్మ.

వృద్ధుడు గడ్డి బొమ్మను వేపచెట్టు మొదలుకు అంటగట్టాడు నిలువుగా. దానిగుండెలమీద అడివిలో ఎర్రపూలు తెచ్చి కుట్టాడు.

"సీతమ్మా..."

మంచి పిల్లవాడివలె సీతమ్మ దగ్గరకొచ్చింది...బుజ్జగించాడు.

"అడుగో... సీతమ్మా... సాంబడు... అడుగో... సుబ్రమణేన్ని పొట్టనేసుకొన్న సాంబడు—"

సీతమ్మ మువ్వలు మోగించింది. వూపుగా కొమ్ములు విసిరింది. ముసలి వాడికి కొడుకు గాయం కనిపించింది కొమ్ముల్లో.

"ఊః... సీతమ్మా...ఊఁ—" వృద్ధుడు అభినయం చేశాడు. తన తలతో గడ్డిబొమ్మకు తాకుయిచ్చాడు.

"ఊఁ...సీతమ్మా...అడుగో...సాంబడు..."

సీతమ్మ తిరిగి మువ్వల్ని వూపింది. కాలితో నేలరాచింది. మరుక్షణంలో గడ్డి బొమ్మమీది ఎర్రపూలు సీతమ్మ కొమ్ముల పైకెక్కి ముద్దెట్టుకొంటు న్నాయ్.

సీతమ్మ వృద్ధుణ్ణి చూసింది. వృద్ధుడు నీళ్ళు నిండిన కళ్ళతో చూశాడు. "సీతమ్మ కొమ్ములకు కొత్తనునుపు వచ్చింది" అనుకొన్నాడు. అనుకొం టున్నంతలో చెట్ల ఆకులు రాలి పోయినై.

* * *

అప్పలనర్సు ఒక్క "లగూన" వచ్చి—

"బావోయ్, సెంద్రయ్య మామొచ్చి నాడ్రోయ్" అన్నాడు అది సేసుతో, లోపల నాగరత్తం విన్నది. ఆవిసేసు పైన కండవా వేసుకొని వెళ్లాడు.

"మాఁవా—యింత కబురు లేకపోయో... అఁచ్చుచ్చుప్పూ... ఎట్టయి పోయినవ్...ఎట్టయిపోయినవ్..."

"భద్రాచెలం పొయ్యానుగా" అన్నాడు బాల చంద్రయ్య కొద్దిగా నవ్వ ప్రయత్నించి.

నాలుగు క్షణాలు...

"నాగరత్తంకు పెళ్ళి జేసినాం"

"ఓసి...అట్టనా...?"

''నలుగురు పెద్దలు సెప్పిన మాటల పెకారం సాంబడికిచ్చి అంట గట్టినాం"

బాలచంద్రయ్యకు ఆకాశం కనిపించలేదు.

...నలుగురు పెద్దలూ...సూదుల అప్పన్నా, గౌళ్ళ నరిచిమ్మలూ, ఆది కేచవులు నాయుడు... గొడ్డావారి పెద్దబ్బాయీ... బాలచంద్రయ్య కళ్ళు మీది కెత్తాడు. ఆ కాంతిని 'ఆదిసేసు' గూడా గమనించలేదు. దొడ్లో మువ్వలు మోగినాయ్. రణనినాదం వినిపించింది. సీతమ్మ అంకెలో.

* * *

సాంబయ్యకు మంచి ఆలోచనే పోయింది. బాలచంద్రయ్య ఆ యిల్లు కాస్తా నాగరత్తానికి రాసిస్తాడని ఆశవుంది. సంజవేళ యింటికొచ్చి—''మీ బాలయ్య మాఁవ వచ్చాడంట—"అన్నాడు భార్యతో.

"నువ్వు తోడురా...పోయి సూసొద్దాం." సాంబయ్య సంతోషం కళ్ళెంలేని గుర్రంవలె పరిగెత్తింది.

''నేను బోతుండా...నువ్వు కాస్త తాళిరా..." అని సాగిపోయాడు.

* * *

యుద్ధం ఆగిపోయిననాటి రణస్థలిలాగా వుంది ఆ సాయంత్రం. ఏ మూల జూసినా ఆకాశపు ఎఱుపు ప్రతిఫలిస్తున్నది. సాంబయ్య—దొడ్లో మెల్లగా కాలెట్టాడు.

"బాలయ్య బాబా! ఓ బాలయ్య బాబా—" ఎంతో ఆప్యాయంగా పిలిచాడు?

సీతమ్మ నీళ్ళు తాగుతోంది. బాలచంద్రయ్య గాబుమొగన నుంచొని సీతమ్మను సముదాయిస్తున్నాడు.

"ఎప్పుడొచ్చావే అంట బాలయ్య బాబా" ముసలివాడు తలెత్తి చూశాడు, సాంబన్న కోరమీసాలమీద ఎర్రపూలు నిల్చినట్లుగా భ్రమించాడు.

''ఎవరు....? సాంబన్నా! యిదిగో వస్తిని."

వృద్ధుడు సీతమ్మ పిక్కమీద చరిచాడు. కొమ్మును గోటితో కొట్టాడు.

సీతమ్మ మోరెత్తింది.చంగణాలు తొక్కింది. అడవిలో పాటలాగా-రంకె వేసింది. మువ్వలు మోగించింది. మువ్వలు మోగినాయ్, దక్షయజ్ఞంలో వీరభద్రుడి రుంజలవలె, సీతమ్మ ఆగలేదు. ముందుకు దూకింది. శివాలెత్తింది.

''సాంబయ్య వచ్చాడు సీతమ్మా."

సాంబయ్య కదలలేక పోయినాడు—ఆ విద్యుద్వేగం ముందు. గుండెలో సీతమ్మ వాడి కొమ్ములు దూరిం తర్వాత కదిలాడు.

''అయ్యో .... సచ్చాను....బాబో .... బాలయ్య బాబూ...." మువ్వలే జవాబు.

నాగరత్తం గడపలో కాలు బెట్టింది. సాంబయ్య పేగులు కొమ్ములకు పాగా జుట్టుకొని సీతమ్మ స్వాగతం యిచ్చింది.

గాబుపక్క నెత్తురుముద్ద సాంబయ్య కనిపించాడు.

"మాఁవాఁ!....నా పసుంకుంకమ—"గొల్లుగా యేడ్చింది.

సీతమ్మ రెండడుగులు వెనక్కు పోయింది. బాలచంద్రయ్య రెండడుగులు ముందుకు వచ్చాడు.

"ఎర్రిమొగమా, నీ పసుంకుంకుం కేవేఁ? సుబ్రమణ్ణెం బావ సచ్చాడనుకొన్నావా?"

నాగరత్తం ముఖాన కప్పుకొన్న పమిట కొంగుతీసి ఆ పిచ్చివాణ్ణి చూసింది. సీతమ్మ మువ్వలు తిరిగి మోగినాయ్.

*　　　*　　　*

బారెడు పొద్దు పోయాక బాలచంద్రయ్య సీతమ్మను స్మశానం వేపు తోలు కెళ్లాడు. స్మశానంలో బూడిదంతా మాయమైపోయింది. పచ్చగా, మృత్యుసన్నిధిలో కల్యాణాన్ని పాడుతున్నది. వృద్ధుడు, కొడుకు బండెడు కట్టెలమీది కెక్కినచోటు, గుర్తుబట్టాడు.

"ఎంత గడ్డి మొలిచింది సీతమ్మా."

సీతమ్మ మువ్వల మోతకు పచ్చిక మొనలన్నీ తలలూపినై. బాలచంద్రయ్యకు కంపం వచ్చింది. నిలవలేక పచ్చికలో కూలబడ్డాడు—కళ్ళు మూసుకొని. ○

(భారతి : వికృతి ఫాల్గుణము)

# యశోద కొడుకు

సావధానంగా వినటం - బాల్యంనుంచి నేను అభ్యసించి వంట బట్టించుకున్న విద్య అని తప్పుగా భావించుకొంటుంటాను. నిజానికిది నా స్వభావం కానేకాదు. వృత్తిరీత్యా అబ్బినగుణం. న్యాయవాద వృత్తిలో, అందునా జిల్లా స్థాయిలో అధిక భాగం క్రిమినల్ కేసుల ప్రాక్టీసు చేస్తున్నవాడు - వినడం ఎట్లాగో తెలుసుకోవాలిగదా. ఆ తరవాతనే ఆలోచించటం, చదవటం, వాగటం.

ఖరగ్‌పూర్‌లో మెయిలు బండి కొంచం సేపు ఆగుతుంది. హవురా నుండి మాతోపాటు ప్రయాణిస్తున్న బెంగాలీబాబు ఒక్క మాటామంతీ లేకుండానే దిగిపోతున్నాడు. బోగీలో మేమిద్దరమే మిగిలాం. వెలుగుతున్న లైటును ఆర్పేసి సదాశివరావు డిమ్‌లైటు స్విచ్‌వేసి కిటికీవైపు చూస్తూ వంగిన మాను వలె నిలబడిపోయాడు. ఆ రోజుల్లో యిన్ని రైలుబండ్లెక్కడివి? ఇంత వేగం ఎక్కడ!

"అప్పుడేనా .... సదా. ఇంకా ఏడు గూడా కాలేదు" అన్నాను నేను లైటును గూర్చి.

మద్రాసు మెయిలు కొంచెం వేగం పుంజుకుంది. ఆ సమయాల్లో రైలు బళ్ళుగూడా వేర్వేరు సంగీత రాగాలు పాడుతుంటాయ్, మీరూ వినివుంటారు! బయటిగాలితో మిళితమై ఆ చీకటి సంగీతం మనిషిని ఎంత వంటరిని చేస్తుంది· అనుభూతులమీద విశాలమైన ఎన్ని చిత్రవిచిత్ర తాత్విక విషాద ముద్రలు వేస్తుంది?

సదాశివుడు పదిక్షణాలు ఏమీ మాట్లాడలేదు. నా మాటలు విన్నాడో లేదో గూడా అని అనుమానిస్తూ మళ్ళీ నోరు మెదపబోతుంటే అతని మాటలు, అతి మెల్లగా వినవచ్చాయి.

"ఈ కూపేలోకి యింకెవరొస్తారు - మనిద్దరమేగా"

మా వృత్తి పెట్టిన ఇంకో భిక్ష-మన స్తత్వ పరిశీలన నాకు ప్రవృత్తిగా మారిందేమో, సదాశివుణ్ణి యీ వారం రోజుల్నుంచీ గమనిస్తున్నాను: ఏదో చెప్పాలని పెదిమలదాకా వచ్చిన మాటల్ని తిరిగి గుండెలోతుల్లోకి బలవంతాన నెడుతున్నాడని, మేము వారణాశిలో తిరుగు ప్రయాణం ప్రారంభించిననాడే నాకు తట్టినా, యిప్పుడే పసిగట్టినట్లుగా వాడి హృదయం తేలికపడే అవకాశం కల్పించటానికి పూనుకొని -

"తిందామా సదా-నీకు చాలా బోర్ కొడ్తున్నట్లున్నది యీ ప్రయాణం" అన్నాను.

"ఆకలి లేదురా" అని, మళ్ళీ "సరే, కానీ - ఎప్పుడోప్పుడు తినాల్సిందేగా" అనుకుంటూ వాష్‌బేసిన్ వేపు దారి తీశాడు. హౌరాలో మా డిన్నర్‌కు ఆర్డరేమీ యివ్వలేదు; రైల్వే తిండి యిప్పుడంత అధ్వాన్నంగా వుండేదిగాదు ఆ రోజుల్లో. కలకత్తాలో కొనితెచ్చిన రసగుల్లా డబ్బాలు, పళ్ళబుట్టా, హోటలు వాడు మాకు కట్టిచ్చిన శాండ్‌విచ్చెస్ - ముందు పెట్టుకొని సదా కోసం ఏమి విప్పుదామా అని పటాపటాయిస్తూంటే - నాకు పళ్ళు చాలు అన్నాడు.

"మంచిది. వాటితోపాటు రెండు రసగుల్లాలు గూడా" అని అన్నాను.

తింటూ తింటూ "ఏమీ మాట్లాడవేమిరా - యిన్నేళ్ళ తర్వాత కలిశాం గదా" అన్నాడు తను.

"మాట్లాడవలసింది నువ్వు. ఈ నాలుగు రోజుల్నుంచి నాచేత చాలా వాగించావ్"

నావంక ఆశ్చర్యంగా కళ్ళు తిప్పాడు. నాకు తెలుసు, నా మాటలు వాడు సరిగా వినలేదని, నేనింతసేపు ఏం మాట్లాడిందీ గూడా వాడికసలు జ్ఞాపకం గూడా వుండివుండక పోవటమే ఆ ఆశ్చర్యానికి కారణమనీ. ఫలం ఒక్కటీ ముట్టుకోకుండా నా శాండ్‌విచ్‌లో సగం తుంపుకొని నోట్లో పెట్టుకొని, ఆ గుడ్డిలైటుగూడా తన ముఖం మీద పడకుండా సర్దుకొని- "అవున్రా. క్షమించాలిరా. నీతో మాట్లాడవలసిందీ, చెప్పవలసిందీ చాలా వున్నది" అన్నాడు చిట్టచివరకు.

వినటం ఎలాగో తెలిసినవాణ్ణి. రసగుల్లా డబ్బా మూతకోసి నిశ్శబ్దంగా తినటానికి పుప్రక్రమించాను. మొదటిసారిగా, సదాశివుడిలాంటి ఆలోచనా పరులైన లాయర్ల గొంతులుగూడా స్వవిషయాలొచ్చేసరికి రుద్ధమవుతాయని, ఎన్నో ముద్దాయిల, సాక్షుల, పోలీసుల స్వరాలు విన్న- నేను గ్రహించ గలిగాను. రైలు చక్రాల సంగీతం మంద్ర గంభీరంగా చీకటితెరల్ని చించుతూ వినవస్తూనే వున్నది.

*   *   *

"నీకు తెలుసుగదా- మద్రాసులో మా యిల్లు, మైలాపూర్ చివర్న. నా జూనియరు ఒకతను వెంకటాచలం-చెల్లెలి వివాహం అని కారు తీసుకెళ్ళాడు. రెండో అతను జోగారావు అప్పటికే వచ్చి ఆఫీసుగదిలో వేచివున్నాడు. మా ఆవిడ- భోజనం అని రెండుసార్లు పిలుపు నిచ్చింది. ఫైలు మూసి లోపలి కడుగేయబోతుండగా వచ్చాడు ఆ కుర్రవాడు- నిశ్శబ్దంగా. నమస్కారం గూడా చేయలేదు. చేతిలోసంచి వెతుకుతూ అట్లాగే నిలబడ్డాడు. చికాకు వేసింది.

"ఎవరు?" అని ప్రశ్నార్థకంగా చూశాను. మాసిన బట్టలు. ఎక్కువ చదువుకున్న వాడుగా గూడా కన్పించలేదు. చామనచాయలో దృఢంగా వున్నాడు. సంచీలో కాగితాల కట్ట తీసి చెయిచాపాడు.

"పలకవేం?" ఎవరునువ్వు?" అని చికాకును అక్షరరూపంలో వ్యక్తం చేశాను.

నిశ్శబ్దంగానే కాగితాల కట్టను టేబిల్‌మీద వుంచాడు. "మా అమ్మ యిచ్చి రమ్మన్నది."

అప్పుడు పరికించి చూశాను. ఎక్కడో పరిచయమున్న ముఖమేననిపించింది. ఆ పెదిమల కదలిక నవ్వుతున్న కళ్ళు చిన్న నుదురు. ఇరవై ఏళ్ళ పైబడ వయసు. ఎక్కడబ్బా?

"మీ అమ్మా? ఎవరామె?"

అప్పుడన్నాడు -

"నేను యశోద కొడుకును"

సందేహం తీరిపోయింది. పరిచిత ముఖమే ననిపించిన ఆ పోలికలు యశోదవే.

"కూర్చో...."

ఆ కుర్రవాడు తెచ్చిన కాగితాలకట్టను తెరిచి చూశాను. కింద కోర్టులో వీగిపోయిన కేసు పూర్తి రికార్డు.

"మీ అమ్మ ఏం చెప్పమన్నది?" కట్టచూపిస్తూ మళ్ళీ ప్రశ్నించాను.

రాత్రి ప్రయాణం చేసివచ్చాడేమో గుడ్డలు మాసి వున్నాయి. పొద్దున టిఫిన్ గూడా తిన్నట్లు కన్పించలేదు, మా యిల్లు వెతకటానికే చాలా శ్రమపడి వుంటాడనిపించింది.

"ఏం చెప్పలేదు యశోద కొడుకని చెప్పి ఇచ్చి రమ్మంది"

మా ఆవిడ వంట మనిషిని పంపింది భోజనం జ్ఞాపకం తెచ్చేందుకు. "ఆకలిగాలేదు. రెండు కాఫీలు పంపండి" అని పురమాయించాను.

జోగారావు వాచి చూస్తున్నాడు-ఇవ్వాళ ముఖ్యమైన అప్పీలు కేసులో చివరి ఆర్గ్యుమెంట్లున్నాయని సూచిస్తూ.

"ట్రాంలో వెళ్ళే టైమ్‌లేదు. టాక్సీ పిలవగలవా?" అని జోగారావు వంక చూశాను-నల్లకోటు తగిలించుకుంటూ. నా భార్య హాలుమధ్య నిలబడి "మళ్ళీ ఎవరో శనిగ్రహం దాపురించిందా?" అని వంటమనిషిని ప్రశ్నించటం వినిపించినా నేను పట్టించుకోలేదు. పరస్పర గౌరవం మా యిద్దరిమధ్యా అంతరించి చాలా సంవత్సరాలు గడిచాక యిప్పుడు ప్రతి మాటకూ చీకాకు పడటంలో అర్థంలేదు గదా!

హైకోర్టు సమీపంలో తంబుచెట్టివీధి మొగలగా వున్న హోటల్లో ఆ కుర్రవాణ్ణి దింపి-"స్నానం చెయ్యి, భోంచేసి గదిలో నిద్రపో. విశ్రాంతిగా పడుకో. కాగితాల సంగతి తర్వాత మాట్లాడుకొందాం. సాయంత్రం వచ్చి నిన్ను తీసుకెళ్తాను....సరేనా?" అన్నాను.

తల వూపాడు.

"పేరు చెప్పలేదు?"

"శివుడు" అన్నాడు ఆ యువకుడు.

ఛడాలున వెన్నువూస ఎవరో చరిచారా - అనిపించింది. నేను యశోదను మరిచిపోయానేమోగాని యశోద నన్ను మరువలేదు.

*　　　*　　　*

సదాశివుడు మళ్ళీ మౌనముద్ర వేశాడు. తినటం గూడాలేదు. కలకత్తాలో దొరికే పెద్ద అరటిపండ్లు-లోపల నల్లటి గులకరాళ్ళ వంటి గింజలుండేవి, మన ప్రాంతంలో బొంతపండ్లలాంటివి-తోలువలిచి అతని కందించాను.

"సదా- నువ్వేమీ తినలేదు"

లేచి లైటువేసి తన సిగరెట్టు టిన్ను వెతుక్కుంటున్నాడు.

"నీ పాత బ్రాండు వదల్లేదన్నమాట" అని నిశ్శబ్ద భంగం చేశాను. చాలా ఖరీదైన సిగరెట్లు కాల్చటం అతని పాత అలవాటు. బార్ కౌన్సిల్ ఎన్రోల్మెంటు నాటినుంచీ అభ్యాసం అని నా జ్ఞాపకం.

సిగరెట్టు ముట్టించకుండానే లైటుతీసేసి తనే అన్నాడు.

"యశోద ఎవరు- అని అడగనేలేదు నువ్వు. కాశీలో ఒకసారి నీ సలహా అడిగాను. మరిచిపుంటావు"

"అదే జ్ఞాపకం చేసుకుంటున్నారా. ఓమాటు కులాంతర వివాహ ప్రసక్తి తెచ్చావు మనం బోటు దిగుతూన్నపుడు. ఆమేనా-?"

ఒక నిట్టూర్పు వచ్చింది. ఆతనేదో తనలోనే శాశ్వతంగా దాగివుండాల్సిన ప్రణయోదంతం వెలిగక్కబోతున్నాడని ఆశబ్దం సూచిస్తున్నది. మౌనం వహించటం యిక నావంతు.

"పిరికివాళ్ళు గొప్ప పనులు ఎన్నడూ చేయలేరు. యశోదను అన్యాయం చేశాను....అన్యాయం అంటే...."

మళ్ళీ ఆగిపోయాడు.

"నువ్వు పిరికి వాడవంటే ఎవరూ నమ్మరు"

సాలోచనగా నావంక చూశాడు.

"యశోదే నన్ను పిరికివాణ్ణి చేసింది"

యశోద....యశోద....యశోద....

సదాశివుడూ, నేనూ క్రిస్టియన్ కాలేజిలో డిగ్రీ తరగతులకు హాజరవుతున్నపుడు వాళ్ళ వూరు తీసుకెళ్ళాడు. వాళ్ళ వీధిలోనే అకస్మాత్తుగా ఒక యింటిముందు ఆగి "ఉండు జామకాయలు తెస్తాను" అని నా జబ్బగుంజాడు. అప్పుడు చూశాను యశోదను. నాకు క్షణికంగా కనిపించిన యశోద సాధారణ యువతి కాదని ఆ క్షణమే అనిపించింది. సౌందర్యమో, సమ్మోహనమో తెలీదు.

"జామకాయల యిల్లేనా?" అని ప్రశ్నించాను.

"అవును .... ఇంకోమాటగూడా నీకు చెప్పలేదు. ఆ కుర్రవాడిలో యశోద పోలికలుగాదు నేను చూసింది, నా పోలికలు. ఆ పిల్లవాడు నా కొడుకు!"

సదాశివం సిగరెట్టు యీమాటు ముట్టించుకొన్నాడు. కాని అతని చేతులు వణకడం ఆ మసకచీకట్లో గూడా స్పష్టంగా నేను చూడగలిగాను.

మళ్ళీ నిశ్శబ్దం అలుముకొన్నది. మెయిల్‌బండి ఒరిస్సా రాష్ట్రంలో ఏ స్టేషల్లో ఆగిందో మేమిద్దరమూ గమనించలేదు.

*　　　*　　　*

సదాశివుడూ, నేనూ ఒక ఊరివాళ్ళం కాదు. కనీసం దూరపు బంధువులంగూడా కాదు. మా ప్రథమ పరిచయం సెకండరీ స్కూలు పరీక్షా కేంద్రంలో దాదాపు ముప్పయ్ సంవత్సరాల క్రితం, చిత్రమైన పరిస్థితుల్లో సంభవించింది. ఒక విద్యార్థి చేస్తున్న కాపీని, యింకో విద్యార్థిమీద నెపం వేశాడు ఇన్విజిలేటర్. "అది తప్పు" అని అంతమందిలో లేచి నిర్భయంగా వెల్లడించిన వాడు సదాశివం. ఆ యింకో విద్యార్థిని నేనే. ఆ క్షణం నుండి ప్రారంభమయింది మా స్నేహం. ఆ క్షణంనుండే, నా చిత్త వృత్తులమీద అతని ప్రభావమూ పనిచేయసాగింది.

అప్పటికింకా ఆంధ్రరాష్ట్రమూలేదు. విశాలాంధ్ర నినాదమూ పుద్భవించలేదు. ఆంధ్రమహాసభలుమాత్రం కతాజితుగా జరుగుతున్నట్లు వార్తలు చదివేవాళ్ళం. ఆంధ్ర నాయకుల అంతఃకలహాలుగూడా వినవస్తుండేవి. వీటన్నిటి మీదా విశ్లేషణలు, విశేష వ్యాఖ్యలు సదాసుండే నేను వింటుండేవాడిని. హైస్కూలు విద్యార్థికి అంత రాజకీయ పరిజ్ఞానం ఎట్లా అబ్బిందో వాళ్ళింటికి వెళ్ళింతర్వాతనే గ్రహింపయింది. వాళ్లనాన్నగారు నాన్‌కోపరేటరుఅంటే ఈ కాలపు యువతీయువకులకు తెలీదేమో. గాంధీజీ సహాయ నిరాకరణోద్యమంలోనూ, ఉప్పు సత్యాగ్రహంలోనూ కారాగారశిక్ష అనుభవించిన కాంగ్రెసువాది. తల్లి ఆదరణ సంస్కార ప్రియుల గృహంలో గాని లభ్యంగాని వస్తువు. సదాశివుడి ప్రభావ వీచికలను నేనిక ఆస్వాదించకుండా వుండగలనా?

షర్టు ఇన్సర్టు చేసుకొనే ఫాషనూ, జనరల్ పుస్తకాలు చదివే అభిరుచీ నేర్పినవాడు తనే. బ్రిటిష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వాళ్ళంతా క్రైస్తవ మతానికి విరోధులే అనే దుష్ప్రచారం, అమాయికులమీద వెదజల్లు తున్న ఆనాటి దొరలు ప్రిన్సిపాల్సుగా వున్నందున క్రిష్టియన్ కాలేజినుంచి మరలించి మచిలీపట్నం రమ్మని ప్రోత్సహించిందీ తనే. కాశీక్షేత్రం, పండిత మాలవీయ బెనారస్ విశ్వవిద్యాలయం- యీ అద్భుతమైన స్వప్న దృశ్యాల్ని నాకు వివరించిందిగూడా తనే. ఉత్సవవిగ్రహంలాగా అనుసరించటమే నా వంతయింది. అట్లా ఆరు సంవత్సరాలు మా సన్నిహిత సాహచర్యం కొనసాగింది. 'లా' కోర్సు మాధ్యేయంగా, వారణాశిలో యుగయుగాల ఆర్య సంస్కృతీ చిహ్నా

లైన ప్రాచీన గంగాఝరీ ఘట్టాల నిత్యపరిభ్రమణ మా దినచర్యగా ఆనాటి జంటకవులం మేము. మెస్‌లోనూ, హాస్టల్లోనూ వాదోపవాదాలు.

నాలుగు ఆంగ్లపదాలు ఎక్కువ నేర్చిన గర్వంతో అతి మేధావుల మనుకొనే అయ్యంగార్లూ, సిసలు దేశభక్తి మాదేనని మొండివాదాల్లోకి దిగే బెంగాలీ బాబులూ, వాదనలో వీగిపోతే వేరేమీ చేతగాక జబ్బపుష్టి ప్రదర్శనకు తలపడే భయ్యాలు, బీహారు మైదానాల భూస్వామ్య పుత్రులైన ఆగడాల మైథిలీలూ- మా జంటను గౌరవించని సంఘటన నాకిప్పటికీ జ్ఞాపకం లేదు. ఆ దశాబ్దాల్లో గంగాప్రవాహం ఎంత నిర్మలంగా గోచరించేదో; ప్రతి తగాదా తర్వాత అందరి హృదయలూ- సదాశివుడి ముగింపు మాటల్తో నిస్సంకోచమై పోయిన ఘట్టాలు అసంఖ్యాకం.

టై కట్టుకోవటం, టెన్నిస్ ఆడటం వంటి బాహ్యానాగరికా లక్షణాలనే గాక, అందరు మానవుల్నీ సమదృష్టితో చూడగల అంతః సంస్కారాన్ని గూడా నాకు బోధించిన అసామాన్య మిత్రుడు సదా. కాని యీ గద్గదకంఠం యీ విషాద తత్వ జిజ్ఞాస, యీ పశ్చాత్తప్త ఆత్మనివేదన- ఆనాటి ఆ యువ ప్రజ్ఞా పాటవశీలివేనా- అని అంతరాంతరాల్లో నేనూ మధనపడుతున్నాను, మద్రాసు మెయిలు బండిలో కూర్చొని. కాపీలో లా కాలేజి పూర్వవిద్యార్థుల సంఘసమావేశాలకు నన్ను టెలిగ్రాముల మీద యీడ్చింది- తను సగంలో వదలిన యీ గోడు, యీ అర్థాంతర కన్‌ఫెషన్- వినిపించటానికేనా? జ్ఞాపకాలు యింకా యింకా వెనక్కి పోతున్నవి ఆ గనిని తవ్వితే సదాశివుడి ప్రస్తుత మనోవ్యథకు మూలకారణం తడుతుందేమో.

నిజమే, మొదటి సంవత్సరం సెలవలనుండి తిరిగివచ్చి, బోటులో గంగదాటుతూండగా ఏ సందర్భం లేకుండానే, సదా ప్రశ్నించాడు. "కులాంతర వివాహాల పరిణామం ఎట్లా వుంటుంది?" గంగామాత ఘట్టాలను నింపుతూ పితృతర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తూన్న, వివిధ భాషల రాష్ట్రాల యాత్రిక సమూహాన్ని మనసులో వుంచుకొని ఆ ప్రశ్న వేశాడని అప్పటికి నా కనిపించక మామూలు ధోరణిలో "భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వంలో భిన్నత్వం- నీ కంటె నా కెక్కువేమి తెలుసు?" అన్నాను. బోటు అల్లంతదూరాన వుండగానే గట్టు మీదికి లంఘించిన వాడు తిరిగి ఆ ప్రస్తావన తీసుకురాలేదు.

యూనివర్శిటీ పరీక్షలు, బార్ కౌన్సిల్ పరీక్షలు ముగిసిందాకా కలిసే వున్నాంగదా. జిల్లా ముఖ్యపట్నంలో మా వృత్తి ప్రారంభం కావాలిక. ఎవరి

స్వస్థలాలకు వాళ్ళం వెళ్ళాం. జిల్లాలో అయితే మా కుటుంబాలకున్న పరపతితో బాగానే నెట్టుకు రాగలం అనే ధీమా, మా యిద్దరిలోనూ వుండేది. కాని ఒక వుదయం నేను నిద్రయినా లేవకముందే సదా నా పక్కన కూర్చొని వున్నాడు. ముప్ఫయి మైళ్ళు సైకిలు మీద పయనించి రావటానికి ఏ రాత్రిలో మేల్కొన్నాడో.

"ఒరే మనం మద్రాసులో జీవితం ప్రారంభించుదామా? మంచి సీనియర్స్ మా నాన్నగారు ఏర్పరచగలడు"

ఆశ్చర్యాన్ని దిగమింగి "స్నానం చేద్దాం. కాఫీ తాగుదాం. మాట్లాడుకొందాం" అని దాటవేశాను.

"కాదు... అవునో, కాదో చెప్పు" అని నిలవేశాడు.

"నాకంత ఆర్థిక స్తోమత లేదని నీకు తెలుసు గదా సదా"

అంతే. మరుమాట లేదు. దుమ్ముకొట్టుకొన్న సైకిలు దిక్కు మార్చాడు. వెళ్ళిపోయాడు. దుప్పటి తీయకుండానే మంచంమీద దిగాలుపడి కూచొన్నాను. సదాశివుడు అంతదూరం పోవాలనే, హఠాత్ నిర్ణయం ఎందుకు తీసుకొన్నాడు? వాడి మనసును ఎంత సత్యమే పలికినా, ఎందుకు నొప్పించాను? మా దారులు చీలిపోయినాయ్. నేనిక్కడ, తను మద్రాసులో. మేము ఏకప్రవాహం కాదా? వేర్వేరు దిక్కుల్లో పయనిస్తున్న పాయలమా? దిగులుతో, ఒంటరిగా నిలబడగలనన్న ఆత్మవిశ్వాసంలేక, నిద్రలేని రాత్రులు గడిపి, బతిమిలాడుతూ వుత్తరం వ్రాశాను. "ఒరే, సెంటిమెంటల్ ఫూల్—నేను వేరే కారణాలవల్ల యిక్కడికొచ్చాను. అనుమానాలు వదిలేసెయ్. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్—ఎవిడెన్స్ యాక్టు నీ గీతాధ్యయనం చేసుకో. సివిల్ సైడ్‌ను కన్నెత్తి చూడకు. నీ జెండా ఆకసంలో ఎగురుతుంది." ఆ జవాబు వాడి ఆశీర్వచన. వేరే చెప్పనక్కర్లేదనుకుంటాను. వాడి సలహాను తు చ తప్పలేదు. నా పెళ్ళికి బండెడు పుస్తకాలు, నా లైబ్రరీలో లేనివి కానుకగా యిచ్చాడు. వాడి పెళ్ళికీ వెళ్ళాను. వాళ్ళ వూళ్ళోగాదు. మద్రాసులోనే.

నా కెందుకుకో అనిపించింది- అంతర్వాణా? ఈ పెళ్ళి వాడి విశిష్ట వ్యక్తిత్వానికి తగినది కాదని. అయిదారేళ్ళ తర్వాత నా అంతర్వాణి నిజమే పలికిందనుకోవటం గూడా జరిగింది.

నన్ను పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పానెల్‌లో యిరికించినప్పుడు వాడి సలహానే అనుసరించాను- "దేశభక్తుల్ని జైళ్ళలో నెట్టి నిద్రపోలేవు. నీ మనస్తత్వం నాకు తెలుసు. మరిచిపో- పానెల్ సంగతి" అని రాశాడు.

సదాశివుడు- కసితో తన ప్రాక్టీసు ప్రారభించాడేమో. అనతికాలంలోనే అనన్య దుర్లభమైన పేరు సంపాదించాడు. హేమాహేమీలైన వుద్దండ పండితుల్ని చిత్తుచేశాడు. తెలుగు లాయర్లను ఎప్పుడూ దరిచేరని తమిళ జిల్లాల కేసులెన్నో అవలీలగా లంకించుకొనేవాడు. ఆంధ్రులు ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సుకు ప్రతీకంగా మద్రాసు హైకోర్టు వరండాల్లో తిరిగిన రోజుల్లోనే తను లీడర్‌గా బార్‌నంతా అల్లకల్లోలం చేయగలిగాడు. ఒకసారి- "బెంచీ ఎక్కమంటున్నారు" అని తంతి కొట్టాడు నాకు. అంటే హైకోర్టు జడ్జీపదవి అన్నమాట "బెంచీ ఎక్కితే నీ కాళ్ళు, కళ్ళు గుండెనెప్పి పుడతాయిగదా" అని నేను సమాధానం యిచ్చాను.

అట్లాంటి అనుబంధం మాది. అయినా ఇవ్వాళ యీ పయనంలో, తన నుండి వుద్భవించి పైకిలేస్తున్న పరితాపశిఖిని చేతధరించి, గుడ్డివెలుగులో గుండె విప్పి మాట్లాడుతున్నపుడు నాకు సంపూర్ణంగా అర్థంకాని యింకో సదాశివుణ్ణి దర్శిస్తున్నాననిపించింది.

ఈ నిరావరణ రెవరీనుండి నేను బయటపడేవాణ్ణి కాదేమో వాడిమాటలు వినిపించకపోతే.

"సిగరెట్లు కాల్చటం నేర్చుకోరా, కాలం బాగా గడుస్తుంది"

నవ్వి వూరుకొన్నాను.

"మనం కన్యాకుమారి నుంచి మానస సరోవరం దాకా వ్యాపించిన పుణ్యతీర్థాలన్నీ దర్శించాలిరా. వస్తావా?"

"ఫామిలీస్‌తోనా?"

"కాదు- మనిద్దరం. మనిషెప్పుడూ ఒంటరి పథికుడేరా"

నేను మాట్లాడటం మంచిది కాదనిపించింది.

"ఎట్లాగని అడగవేం? విధాత చేతిలోవున్న మరచక్రం అందర్నీ ఒకే పరిభ్రమణలో తిప్పదు. ప్రతిజీవికి వేర్వేరు లెక్కలుంటాయ్"

శుష్కవేదాంతం అనుకొన్నాను. దీనితర్వాత, ఈ ఉపోద్ఘాతంతోనే ఇంకో ప్రకరణకు నాంది పలుకుతున్నట్లు గ్రహించి "వూఁ" అని మాత్రం అన్నాను. అనుకొని మళ్ళీ పశ్చాత్తాప పడ్డాను. సాంప్రదాయ వంచనలమధ్య సాంప్రదాయ అల్పసత్యాలమధ్య బతికే సామాన్య వ్యక్తి మాత్రమే పలికేశుష్క వేదాంతం, సదాశివం ఎప్పుడూ మాట్లాడి ఎరగడు. అవసరానికి మించిన ధనార్జన చేయటం మినహాయిస్తే అతను నాకెప్పుడూ రుషి సమానుడే. రుషులు

సత్యాన్వేషకులు, నిష్కాములు. శాశ్వత ధర్మరహస్యాలను అన్వేషిస్తూ నిర్వ్యాకులమైన మనస్సుతో ఆకాశ మార్గాన్ని పరీక్షిస్తూ సుదీర్ఘ ధ్యానం చేసిన ఉపనిషత్కారులు గూడా ఎన్నో సందేహాలకు గురియై వుండరా?

సదాశివుడు వివరస్తూన్న జీవిత ఘటనా పరంపరగూడా అలాంటి సందేహాలకు ఒగ్గి, అలసిపోయి పునఃప్రారంభమవుతూన్న అన్వేషణగా ఆ సమయంలో నాకుతోచింది. ఎంతటి స్నేహధర్మం వున్నా అతని ఎదట నేను అల్పుణ్ణే అని తెలిసినా, మానవుడికి మానవుడేగదా సహచరుడు? సిగిరెట్టు అవల పారేసి సదా మొదటినుంచీ-తన ఆవేదనా ప్రవాహాన్ని ఎట్లా వర్ణించాడో నేనూ మీముందుంచుతాను.

* * *

"మా గ్రామం చూశావుగదా ట్రంకురోడ్డుమీది వడ్డగౌడౌన్లు మళ్ళగానే మావీధి వుంది. చిన్నవీధి. ఉన్న నాలుగైదు యిళ్ళూ చాలా పెద్దవనే చెప్పాలి. మళ్ళీ వీధిలో ఒకవైపునే ఇళ్ళు ఆవలి పక్కన ప్రహారీగోడలేగాని ముఖద్వారాలు లేవుగదా. ఆ ప్రహారీల మధ్య శిథిలమవుతున్న ఒక ఆర్చి వుండేది. దానికి అభిముఖంగానే యశోద వాళ్ళయిల్లు. చివరన మా లోగిలి. అందువల్లనే గాబోలు మావీధి కొంచెం నిర్మానుష్యంగా వుండేది. మరిప్పుడెట్లా కనిపిస్తుందో? ఈ ఇరవై-ఇరవై రెండేళ్ళనుంచీ నేను చూడలేదుగా.

యశోద నాన్న మా వూరికి ఇల్లరికపు అల్లుడుగా వచ్చి స్థిరపడ్డాడు, స్థిరపడిందెక్కడ? యశోదను కని ధనుర్వాతపు బారినపడ్డ వాళ్ళమ్మ పోగానే గడ్డాలు పెంచుకొని తత్వాలు పాడుకుంటూ, ఉపవాస దీక్షలు పడ్తూ కృశించి పోయాడట. వాళ్ళమ్మ చాలా అందమైన మనిషని అనుకొనేవాళ్ళు- ఏ దుష్ట నక్షత్రప్రభావ నీడలో జన్మించినా యశోద అనాధకాలేదు. అమ్మమ్మ మాణిక్యం అనురాగ పెంపకంలో పెరిగింది. మాణిక్యమ్మకు మంచి మాగాణీ పొలం వుండేది. నవర్సు పదమూడు రూపాయల ధరపలికే ఆ రోజుల్లో ఆమె దగ్గిర చాలా నగలుగూడా వుండేవి. అయితే మాణిక్యమ్మ పిసినారి.

మనుమరాలే ప్రాణంగా ఆమె కంటించాలనే ఆశతోనే పైసాపైసా జమచేసేదని చెప్పుకొనేవారు. ఒకసారి దొంగలు కొంత సొమ్ము అపహరించిం తర్వాత, జవ్వారిఅంతా మా నాన్నగారికి రహస్యంగా ఇచ్చి, మా భోషాణం లోనే దాచుకొనేది. ఏదైనా పండక్కి వచ్చి కొన్ని సొమ్ములు తీసుకొని యశోధను అలంకరించి మళ్ళీ భద్రంచేసేది. యశోదా నేనూ దాదాపు ఒక యీడు

వాళ్ళమో, నేనే ఒకటి రెండేళ్ళు పెద్దవాణ్నో. ఈ విషయాలన్నీ నాకు కొంత వరకే తెలుసు తర్వాత వినికిడి.

నాన్నగారికి వైదిక కర్మల్లో నమ్మకం తక్కువ. తాత్విక చింతనలోనే మగ్నం ఎక్కువ. సేలం జైలునుండి విడుదలై వచ్చాక హరిజనబాలుడు మా ముఖ్యపనివాడు. చాకలి, మంగలి అనే కుల పట్టింపులు గుర్తించకుండానే పెరిగాను. యశోదకైతే అసలు అడ్డంకేలేదు. వాళ్ళింటికి ముందు పెరడులేదు. ఒకనాడు దొంగలు సులభంగా ప్రవేశించిన వెనకవైపు పెరట్లోనే జామ చెట్లు. వాటిచుట్టూ మా ఆటలు. మా యిల్లు గమనించావుగా ముందూ వెనకా విశాల మైన దొడ్డి, పశుపాక. ఆ పాకవెనకనుంచి చిన్న కాలిబాటగుండానే మేమిద్దరం రామకిష్టయ్య పంతులుగారి బడికివెళ్ళి అ ఆ లనుంచి సుమతీశతకం, పెద్దబాల శిక్ష దాకా ఎదిగింది. ఆ కాలిబాట నిర్జనంగా వుండేది.

చిల్లరవారి ప్రహరీగోడను మించి బ్రహ్మాండమే తామైనట్లుగా పెరిగిన జువ్వి, మర్రి, నేరేడు నీడల్లో చెట్టాపట్టాలు వేసుకొని పరుగులు తీస్తూ బడికి వెళ్ళటం, ఒక్కోసారి బ్రహ్మరాక్షసి కథలు చెప్పుకుంటూ, మా కల్పనలకు మేమే భయపడి పారిపోయిరావటం. ఆ కాలిబాటను, ఆ వటవృక్ష ఛాయల్నీ నేను యీ జన్మలో మరువలేను.

శుక్లపక్షం లాంటి మా బాల్యం కృష్ణపక్షమైపోయిన మా యవ్వనం- ఎన్ని జ్ఞాపకాల్ని దాచుకొన్నవో-అవి రామక్రిష్ణయ్యగారి వీధరుగుల బడినుండి, జిల్లాబోర్డు ప్రాథమికోన్నత పాఠశాలలో చేరిన పిదపగూడా, అది చుట్టుబాట అయినా, ఆ నీడల చిరుసవ్వడి ఏకాంతంలోనే మేము నడిచే వెళ్ళేవాళ్ళం. అశ్వద్ధవృక్షపు ఎండుటాకులు మా నిశ్శబ్దాన్ని భంగం చేస్తుంటే, బిక్క మొగం వేసిన యశోదను నేను అమాయికంగా ముద్దిడుకొన్నదీ, నేను పెద్ద యిందాకా నువ్వు పెళ్ళి చేసుకోగూడదని బలవంతంగా, ఆమెచేతిని నాచేతిలో వేయించుకొన్నదీ అక్కడే.

క్లాసురూముల్లో పాఠాలు ప్రారంభించేముందు హాలులో, యశోద ప్రార్థన వుండేది. పద్యం, చిన్నపాట, వచనం మార్చి మార్చి రోజుకో వైవిధ్యంతో చదువుతూంటే, మా యింట్లో పుస్తకాలు తెచ్చి యిచ్చి కొత్తవి పాడమని బలవంతం చేసి, పాడగానే - యశోదమీద నాకున్న అధికారానికి అడ్డులేదను కొనేవాణ్ణి. ఎవరికీ చూపక, యివ్వక నాకే కోసిన ముక్కల జామపండ్లు ఆ సీజనంతా సమర్పించు కొన్నప్పుడు నేనేమనుకోవాలి? ఒక రోజున చేపలకూర తింటూ కనిపించింది.

"ఛీ....వాసనకాదా?" అన్నాను.

"బుర్రకు తెలివితేటలొస్తై చేపలుతింటే" అని తను.

"ములగకాయల్లో భాస్వరం వుంది- నీ మొద్దుబుర్రకు లెక్కలు బాగా వస్తై చేపలు తింటే నేనూరుకోను"

"నా యిష్టం"

"సరే....చూస్తా" అని బెదిరించి వెళ్ళిపోయి రెండురోజులు ఒంటరిగా బడికి వెళ్ళాను.

తనొచ్చి బ్రతిమిలాడుతుందనుకొన్నాను. రాలేదు. మూడోరోజు వాళ్ళమ్మమ్మ పిలిచినా నేను పోలేదు. ఆ మర్నాడే అమ్మతోపాటు ఒక పెళ్ళికి గ్రామాంతరం వెళ్ళాను. నీకు తెలుసుగా, అయిదురోజుల పెళ్ళిళ్ళు ఆడపిల్లవారికి వళ్ళు హూనం మగపెళ్ళివారికి జన్మవినోదం. ఆపెళ్ళి హడావిడిలోనే నన్ను చూసి ముచ్చటపడ్డ అత్తలు, అమ్మతో హెచ్చరించటం విని, ఆమె మనసు నొచ్చుకుంటుందనికూడా ఆలోచించక దుర్భాషల్లాంటి పలుకుల్తో అందర్నీ దీవించి స్వగ్రామం చేరిన మరుక్షణానే యశోద యింటికి పరుగిడి-నేను చేపలు మానేశాను- అని ఆమె ఎదురొచ్చి నవ్వుతూ చెప్పినపుడు నా అధికారం సుస్థిరమైనదని అనుకోనా? వద్దా? పురుష అహంత అట్లాంటిదంటావా? ఇప్పుడనిపిస్తున్నది అహంతేనని.

తర్వాత అది నిర్ధారణ అయింది- ఎట్లా నంటావా? మన బెనారస్ సెలవుల్లో యింటికొచ్చినప్పుడు తన నోటినుండే నిజం బయటపడ్డది. ఉత్తరాది మఠం గురువుల దగ్గర వాళ్ళమ్మమ్మ వుపదేశంపొంది శంఖు చక్ర ముద్రలు భుజాలమీద వేయించుకోగానే సాత్వికాహార నియమం వరించినట్లేగా. అట్లా చేపల ఆహారం కట్టుఅయింది గాని, నా అధికారం వల్ల అభిలాషవల్ల కాదని తెలిసినప్పుడు నా మనోవ్యధను వర్ణించి చెప్పమంటావా? వద్దు.

నేను ఎనిమిదో తరగతి చేరిన మొదటినెలలోనే యశోద చదువు అర్థాంతరంగా నిలిచిపోయిందని చెప్పలేదేమో, స్వేచ్ఛగా నీలాకాశంలో రెక్కలు విప్పి మౌనగీతాలు ఆలాపించుకొంటూ, పూలతావికోసమో పరిమితాహారాణ్వేషణకో, దాహార్తితో, ప్రేమపలపుకో పయనించే అహింసామూర్తికి ప్రతీక అయిన పక్షిని బాణాలతో పడగొట్టటం, తుపాకితో కాల్చటం ఆట అయిన దుష్టనాగరికత-పురుషుడికిచ్చిన అనాగరిక వాతావరణంలో మగదక్షతలేని యశోదల్లాంటి బాలల చదువులు సాగుతాయా?

ఆ యింటి వెనక వీధిలో తాత అని ముద్దుపేరుతో పిలవబడే ఒక జులాయి వెధవ వుండేవాడు. చదువు సంధ్యల్లేని మోతుబరి కుటుంబంలో, ఏ ప్రత్యేక ప్రవృత్తీలేని ఆ రోజుల సోమరి గ్రామజీవనంలో పెరిగిన అల్పుడు. వాడు యశోదకు ప్రేమలేఖలు వ్రాస్తూన్న సంగతి ఎవరికీ తెలీదు- అది మితి మించిన రాగాన పడ్డప్పుడుగాని.

ఆ చివరి వుత్తరం నాకు చూపించింది ఏడుస్తూ యశోద. అన్నీ బూతులు అంగాంగ వర్ణనలు.

"మీ అమ్మమ్మకు తెలుసా?"

తల అడ్డంగా తిప్పింది

"చెప్పొద్దు వాడిపని నేను పడతాను"

ఎంత నమ్మకం? నాకే చూపటం. ఇక వాడికోసం వేట ప్రారంభిం చాం, నేనూ పేర్లవారి నరశింహ్వారావు, మా పనివాడు పుల్లడూ. నరశింహ్వాం మంచి వస్తాదులాంటివాడు. మా పుల్లడు కర్రసాము చేస్తూండగా మాకు నేర్ప మని వేధించి కొంత సాధించాం గూడా. ఒకరోజున కాలవ గట్టున ఒంటిగా దొరికాడు. బురదనీళ్ళలో ముంచి, ఒడలు హూనం చేసి, క్షమాపణ వుత్తరం వ్రాయించుకొని, చీకట్లో యశోదకు అందజేసినపుడు - నేనెంత ధీరుణ్ణి అను కొన్నానో ఏమోగాని, ఆ వారం నుండే మాణిక్యమ్మ యశోదను బడి మాన్పిం చేసింది.

ఈ వుదంతం నాన్నగారికి తెలిసి వుండవచ్చుగాని నన్నేమీ అడగ లేదు. ఆ తర్వాత తెల్సింది-తాతగాడి పెళ్ళిగాని చెల్లెలిది మచ్చల బ్రతుకైనా, వాడు అది తెలుసుకోలేక యశోద చదువు ఆగిపోటానికి నిమిత్తమాత్రుడైనా డని. రోజూ శనగగింజంత నల్లమందు అలవాటున్న మాణిక్యమ్మ ఎంత మత్తులో వున్నా మనుమరాలి మీద ఈగ వాలనీయదని గ్రహించే వుంటావ్. చదివించమని మేము చెప్పినంత మాత్రాన ఆ ముసలి పడనిస్తుందా?

తన బడిచదువైతే ఆగిపోయిందిగాని, ప్రకృతి ధర్మం నిశ్చలమైపోదు గదా. పురాణ, ప్రబంధకన్యల శిల్పాకృతిలో యశోద ఎదిగిపోయింది. మా యింట్లో రవివర్మ జర్మన్ ప్రింట్లలో ఎటు తిలకించినా యశోద అందమే కనిపించేది. అందమేగాదు, మాటగూడా తూచితూచి పలుకుతున్నదా, వెనకటి అల్లరి గాలి తెమ్మరలతుళ్ళు, విప్పుకొని మొగ్గ నుండి పుష్పం కాబోతున్న హాయలు ఎట్లా మాయమైపోయినవా అని ఆమెమాటలు ఆశ్చర్యపరచటం

గూడా సెలవుల్లో వినవచ్చినప్పుడల్లా గమనించక పోలేదు. మాయింట్లో పుస్తకాలన్నీ విరామమెరుగక చదివి, ఆ చదువుతో వున్నతమవుతున్న సంస్కారం నేర్పిన విద్యో లేక ఆత్మవిశ్వాసం అలవరుస్తూన్న పరివర్తనో - యశోద కొత్తరూపం - నాకర్థం కాలేదు.

నా నాలికమీదకు వచ్చిన జోక్స్ అనబడే హాస్యోక్తులు గూడా ఆమె గంభీరముద్రను చూడగానే వెలువడటం మానివేసినా, మా రాకపోకలకు మాత్రం ఎప్పుడూ ఆటంకంవుండేదిగాదు. మాణిక్యమ్మ నన్నెప్పుడూ పరాయి యువకుణ్ణిగా చూడ లేదనే చెప్పగలను. అమ్మమ్మను తను అమ్మా అనిపిలిచే అలవాటును నేను ఎగతాళిచేస్తే, నేను మాణిక్యమ్మను అత్తయ్య అని సంభోదించటం, తనూ ఆటలు పట్టించేది. ఈమధ్య అటువంటి చిన్న హాస్యపుజల్లులు గూడా నిలిచి పోవటమే గాక వారణాసి సెలవల మీద వచ్చినపుడు వాతావరణంలో మార్పువచ్చినట్లు అర్థమై సంగతేమిటో తెల్సు కోవాలనే నిశ్చయానికి వచ్చాను.

కాని తనే ఆ వుదయం మొదటి ఘడియల్లోనే తన సొమ్ములపెట్టెకోసం వచ్చింది. అమ్మనడిగి తాళంచెవి తీసుకొని భోషాణం తెరుస్తూ "ఏమిటి విశేషం?" అని యశోదముఖంలోకి నవ్వుతూనే చూశాను.

మాటలేదు. గంభీరంగా వుంది- ఆ మౌనం గూడా.

స్వతంత్రంగా ఆమె చుబుకాన్ని స్పృశించాను.

"చెప్పవా?" అంటూ పెట్టె అందించబోయాను.

"చుట్టాలొస్తున్నారు" అన్నది, కుడిబుగ్గమీదిసొట్టను తడుముకొంటూ.

"మీకెవ్వరూ బంధువులే లేరనేదానివిగదా?"

"ఇవ్వాళ నిశ్చితార్థం..."

"ఎవరిది?"

"ఎవరిదో అయితే నేనెందుకొస్తాను. నాదే"

గుడిలో దేవదర్శనానికి పోయిన భక్తుడిమీద పైకప్పు కూలినట్లయి, కళ్ళు బయర్లు కమ్మినవి. ఆవేశమో భయమో శరీరాన్ని కుదిపివేస్తున్నది.

నా బలమంతా కూడదీసుకొని, కుడిచేత్తో ఆమె చెంపమీద ఎంతటి దెబ్బ కొట్టానోగాని తనచేతిలో చిన్ని సందుకాయపెట్టె నేలమీద పడి నగలన్నీ దొర్లిపోయినవి. ఆ ఆవేశంలో తనుగూడా కిందపడ్డ సంగతి గమనించకుండానే

ముందువరండాలోకి వెళ్ళిపోయాను. వరండా కుర్చీలో కూలబడి వేడి అశ్రు జలం మోచేతిమీద పడినట్లు, చుట్టూ చిమ్మచీకట్లో కలిసిపోతున్నట్లున్న నాకు స్పృహగూడాలేదు. యశోద లేచి నగలన్నీ ఏరుకొని ఎట్లా వెళ్ళిందోగూడా నేను గమనించలేదు. కాని ఎంతసేపటి తర్వాతనో ఆమె విషాదకంఠం అస్పష్టంగా వినిపించింది.

"ఎందుకు కొట్టావ్? నీకేం అధికారం?"

నాన్నగారు స్వరాజ్యాశ్రమం పనుల్లో నిమగ్నమై వున్నారు. అమ్మ వంటింటి పక్క పూజగదిలో ధ్యానంలో వుందికాబోలు. కళ్ళు తుడుచుకొని తెరుచుకుంటూ లోపలికొచ్చాను. నాకేమీ అధికారంలేని నా బాల్య చెలిమికత్తె యశోద చంద్రహారం నేలమీద మెరుస్తూవుంది. విగతజీవియైన కాలసర్పంవలె అది తెగిపోయివుంది. ఇందాకటి వుద్విగ్నపరిస్థితిలో వెతుక్కోవటం మరిచిపోయింది గాబోలు. తీసి జేబులో వేసుకొన్నాను. మన సెలవులింకా పదిరోజుల దూరం నుండి పిలుస్తున్నాయ్. సకాల వర్షాలు పడేకాలంగదా. పైన మేఘాలు గర్జిస్తున్నా వినిపించటంలేదు. వినిపిస్తున్నదొకటే- "నీకేం అధికారం?"

* * *

ఆరుపేటల హారం. రెండుపేటలు-మెడబిళ్ళనుండి తెగివిడిపోయాయి, ఆరు ముఖాల సర్పంవలె జేబులో. ఓంకారాచారి వద్దకు తీసుకుపోయాను.

"మనదికాదే బాబూ" అన్నాడు, ఇంటిబత్తుడుగదా.

"కాదు"

"మనంటివాళ్ళకాడ వుండే సొమ్ముకాదుగా. చింతామణుల పాతనగలు" అతుకు పనికి వుపక్రమిస్తూన్నాడు.

"అంటే..."

"అంటే ఏముంది? భోగంవాళ్ళవి. గుర్తుపట్టాను. ఇదివరలో ఇట్లాంటి మరామ్మతుకే మానాయన దగ్గిరికొచ్చింది మాణిక్యానిది, పేరుండాలి బిళ్ళమీద"

''ఎంత జ్ఞాపకం'' అన్నాను, ఇంకేమీ అనజాలక.

"లేకేం? మనింట్లోనేగా నాన్నగారి దగ్గర దాచుకోకపోతే యీ కలి కాలంలో ఆ ముసిల్దాని గొంతుపిసికి కాజేయకపొయ్యేవాళ్ళా? చాలా నీతిగల ముండ దాని తల్లో అక్కో - పూడి జమీందారు చేరదీసింది. చాలా సంపాయించిందంటారు నికార్సయిన మనిషి- ఈ మాణిక్యం పీనిగ. తను వృత్తిలోకి దిగలేదు కూతుర్నీ దింపలేదు. లక్షణంగా పెళ్ళిళ్ళు. సంసారాలు చేసు

కున్నారు. మనమరాలి లగ్నం అయితేగాని కళ్ళుమయ్యేదు. ఆ నల్లమందు అలవాటు మనుమరాలి దిగులుతో కాదుటండీ. ఇల్లటం కావాలి. కళావంతులే కావాలి. నాగలింగం ఏదో సంబంధం తెచ్చినట్టున్నాడు. ఈడూ జోడూ కనపడ దండీ- ఆణ్ణిచూశాను. సగం బట్టతల. ఆడింగిరేకుల ముకం. ఆ పిల్లను జూడ బోతే ఇంద్రలోకం పిల్ల. తాంబూలాలు పుచ్చుకొన్నారట్టుంది. అమ్మగారికి అయ్యగారికి తెలిసుండాలే"

రిపేరుపని అయి మాటలూ ముగిసినై. కూలి డబ్బులియ్యబోయాను. "దయవుంచండి అంతేచాలు. అయితే బాబూ కాశీపోవటమంటే యెనకటి హయాంలో ఆర్నెల్లు అనేవాళ్ళు. తమరైతే...సాలుకు రెండు సార్లయినా తిరుగుతారు. బ్రహ్మంగారు చెప్పిందేగదా" నేనిటు తిరగగానే ఓంకారం బీడీ ముట్టిస్తున్నాడు.

ఇంటికి తిరిగొచ్చే సరికి నాన్నగారు పడక కుర్చీలో ఆయనకాళ్ళ దగ్గర మాణిక్యం. హారం సంగతనుకొన్నాను- కాదు.

"కళ్ళకద్దుకు చేసుకుంటారు బాబూ, ఇంకో కులం అంటే మళ్ళీ కళంకం కింద జమకట్టరా బాబూ. మీకు తెలియజెప్పగలిగిన జ్ఞానినా? దానికోసం బతికున్నాను. అయిన కులం వాడయితే అదీ దాని పిల్లలు తలెత్తుకు తిరుగు తారు. అదే ఆలోచించాను బాబూ. ఇరవై దాటుతున్నై. కుంపటిగుండె కాలు స్తున్నా యీ గడియకోసం వెయ్యిదేవుళ్ళకు మొక్కుకున్నాను. నాకళ్ళముందు పడివుంటుంది. ఆస్తి పిల్లపేరగాదు, తనపేర రాయాలని పట్టుబడుతున్నాడు. ఆడదాని సొమ్ము...నామర్దాట" అని గోడువినిపిస్తున్నది.

నాన్నగారి సలహా నేను వినలేదు. ఇదే అదునుగా హారం వాపసు యిచ్చేందుకు బయలుదేరాను. ఆలోచనలు. ఆలోచనలు. ఎందుకు జుగుప్స? ఆహారం, నిద్ర, మైధునం ఈమూడు పశులక్షణాలే కాక మానవుడు అర్రులు చాచే యితర ప్రయోజనాలేమిటి? మాణిక్యం, యశోద తమగౌరవం మాత్రమే కాదు, తమ కుటుంబ గౌరవం తమకులగౌరవం గూర్చి తలపోయటం లేదా? అని నాలోని సంస్కారం ప్రశ్నిస్తున్నదేమో గూడా. కాని నేను ప్రేమికుణ్ణి. అందునా భగ్నప్రేమికుణ్ణి. క్రోధమో, మాత్సర్యమో దేవుడు నాకిచ్చిన ఆభ రణం, వరం ఆ యశోద ఇంకొకరి సొత్తుగా. విపణిలో కులం కొనగలిగిన వస్తువై - శాశ్వతంగా దూరమైపోవటమా? ఈ లోకం కులాన్ని దేవతగా కొలిచేగుడ్డిదైతే, నేను - తను - నన్ను...తనను...ఆలోచనకూడా సరైన పదావళిని కూర్చలేక పోతున్నది.

వెళ్ళి ఆమె వడిలో విసిరివేశాను.

త్రుళ్ళిపడి చూసింది - "ఇంకా కోపమేనా?" అంటున్నది గాని నేను విసవిసా వెనుదిరిగాను.

మిగిలివున్న యీ వారం సెలవులు ఎప్పుడు...రోజూ ఒక కల్పంగా రోజూ ఊర్ధ్వలోకాల దేవతల లెక్కలో నడవవలసిందేనా? అందుకే అనిపించిందికాబోలు. ఈ కాలం పదార్థం - వీటిమధ్య నివశిస్తున్న మానవుడు నిజంగా ఏకాకియేగాని వాటిలో భాగం కాదుగదా. ఏకాకిగానే ఆ దినమంతా గడిపాను. పశువుల కొట్టంలో పాత మంచంమీద నిద్రబోయానో జాగృతిలోనే వున్నానో తెలియనిస్థితి. చీకటి పడ్తూండగా, వెతుకుతూనేను కనిపించక అక్కడికి వచ్చిందికాబోలు, ఏకాంతసేవ చేసేభక్తులకే వాడుదాగే స్థలాలుతెలుస్తాయా? వచ్చి మంచంమీద కూర్చొని తల్లివలె తలనిమిరింది. నాకేమీ అధికారంలేదన్న వ్యక్తి.

"ఎందుకు గుండెలవిసే ఆలోచనలు! ఏంకావాలి నీకు?" అని ప్రశ్నిస్తున్నది. ఆ స్పర్శసుఖంనుండి నన్ను లేపుతూ.

"నువ్వు కావాలి"

"సరే రాత్రికి రా, అమ్మ నిద్రపోయింతర్వాత"

వెళ్ళిపోయింది. కాని పశుకొట్టంనిండా సుగంధం పరుస్తూ పోయింది.

మాణిక్యం నల్లమందు మాత్ర మింగి ఎనిమిది గంటల కల్లా గాఢనిద్రావస్థలోకి జారుకుంటుందని తెలుసు. సైకిలు తీసుకొని గయోపాఖ్యానం నాటకానికని బొంకి బయలుదేరాను. యశోద నాకోసమే కనిపెట్టుకొని వుందేమో.

ఆ-రేయి ఒకానొక అపురూప అనాఘ్రాత పుష్పం ఒక మోహాంధుడి పదఘట్టనలో నలిగిపోయిందో, నాశనమైపోయిందో—అప్పటికి నాకు తెలియదంటే నమ్ముతావా?

లేచి వస్తూంటే ఆమె ఏడుపు వినిపించింది.

"యశోదా భయపడకు మనం లేచిపోదాం" అని తల నిమిరి ముద్దిడుకొని వచ్చేశాను.

ఆ మరురాత్రిగూడా యశోద కోసం వెళ్ళాను-నా ఆలోచనల స్వరూపం వివరించటానికనుకొంటావేమో. కామాతురాణాం నభయం, నలజ్జ-

బలహీనులు, నిర్ధనులు అసహాయులుగా బలవత్తర పరిస్థితులకు తలవొగ్గుతూనే తమ నిరసన ఎట్లా వ్యక్తంచేయగలరో ఆ రాత్రి యశోదనుండే గ్రహించాను, నిరసన అంటే ప్రొటెస్ట్ అనే అర్థంలో ఆలోచించు.

"అంతా ఆలోచించుకొన్నావా?" అని అడిగింది నేను లేచివస్తూంటే. దుఃఖించటంలేదు యివ్వాళ.

"అఁ"

"మనం పారిపోయి మా అమ్మమ్మగుండె పగలి చచ్చినవార్త వినే ఏర్పాటుగూడా యిప్పుడే చెయ్యి. మీ అమ్మా నాన్నా జీవితాంతం తలెత్తు కోకుండా ఎట్లా బతుకుతున్నారో తెలుసుకొనే ఏర్పాటుగూడా చెయ్యి. మొన్న పెళ్ళి నిశ్చితం చేసుకొని, తాంబూలం పుచ్చుకొన్నవాడి మనసులో నామీద శాశ్వత క్రోధం, పగ పెంచుకొని, మనుషుల మీద నమ్మకంపోయి తచ్చాడటం గూడా మన వూహలనుండి తొలగిపోయే మార్గం వెతుకు. ఏమూల వదిగి పోయి బ్రతుకుతున్నా, నీ భార్య భోగం మనిషి, కులకాంత కాదు-అని నిన్నూ నన్నూ ఎరిగిన మర్యాదస్తులందరూ, నీ వెనక, నా చాటున, లొట్టలువేస్తూ కబుర్లు చెప్పుకొంటూంటే విని ఆనందిద్దాం. భోగంది బోగం మనిషికాక మరే మవుతుంది అని న్యాయాన్యాయాల విచారణను కొలిక్కితెచ్చే లోకంసంగతిని ఎవరినన్నా విచారించి చూడు"

"యశోదా-నేనన్నది నిన్ను పెళ్ళిచేసుకుంటానని"

యశోద నాకన్నా ఎంత వున్నతంగా ఆలోచిస్తున్నదో ఏమో మళ్ళీ జవాబిచ్చింది.

"శతాబ్దాలనుండీ ఐశ్వర్యవంతులకూ, వీరులకూ రాజులకు, యిప్పుడు జమీందార్లకు, అధికారులకూ-ఆటవస్తువు, భోగపదార్థం గదా మేము కళావం తులమని చెప్పుకొనే మా జాతి. ఎన్ని ఆవినీతులకు పాల్పడినా సాంప్రదా యంగా వున్న వాళ్ళ విషయంలో పెళ్ళి అంటే అంతా నమ్ముతారు. మా విష యంలో నీతి నియమాలతో పెళ్ళి జరిగినా, దాన్ని ఆ పేరుతో వుచ్చరించరు. స్వసంఘం లోనే వాళ్ళ బతుకు ముడిబడి వుంది. వాళ్ళ వుద్ధరణ జరగాలంటే నేను నువ్వూ కొంత త్యాగం చెయ్యాలో వద్దో తేల్చి చెప్పు"

"మరి...మరి...నాకు..."

"అవును. నా శరీరాన్ని నీకర్పించాననిగదా అనబోతున్నావు? నీ అధి కారం... ! మన బాల్యపు అమాయికత్వంనుండీ, మీ కుటుంబంలో నాన్నా అమ్మా దేశానికి, చుట్టూ మనుషుల కోసమూచేసిన త్యాగందాకా-నేను ఎన్నో విషయాలు నీనుండిగూడా, అవగాహన చేసుకొన్నాను. మీ అమ్మగారి నగ లన్నీ తృటిలో గాంధీమహాత్ముడి హరిజన ఫండుకోసం, ఆయన ఒడిలో పోసి

నప్పుడు ఆమె ఏడ్చిందా? మా అమ్మమ్మ నన్నుగూడా వృత్తిలో దింపి ఇంకా పెద్ద భోగభాగ్యాలు అనుభవించక, నా దిగులుతోనే నల్లమందు అలవాటులో ఎందుకు పడ్డదో? ఎంత అనామకుడైనా ఒక సాటివాడు నన్ను చేసుకొంటే ఎంతకోపం వచ్చినప్పుడైనా "భోగంముండా నీ బుద్ధులెక్కడికి పోతై?" అని తిట్లు పడకుండా వుంటాననేగదా.

నేను నీ స్నేహధర్మం అనుభవించాను. కీచకుల నుండి పాచకుల చూపులనుండీ నన్ను ఆదుకున్నావని గూడాతెలుసు. నేనూ నీలో ఐక్యమయి పోదామనే కలలు కన్నాను. నా శరీరాన్ని నీ అధికారానికి వశపరిచింది - నా బాకీ తీర్చుకుందామని. నా మనసు, నా హృదయిమూ నీపుస్తకాలనుండి చాలా నేర్చుకొన్నాయ్ నీ కోసమేగాదు, నీవాళ్ళకోసమూ బ్రతకాలని. నా ఆత్మను గూడా నీకర్పించ మంటవా-అంతావిని?"

విన్నాను వ్యాకులమైన మనస్సుతోనే, జీవిత ఘటనా పరంపరలను విశ్లేషించుకొనే ప్రయత్నంచేసి ఒకదానికొకటి విరుద్ధమైన తర్కాలు ఎదురౌ స్తుంటే, తలవంచి ఆ వ్యాకులత మరింత జటిలమైపోతూంటే ఆ లోకంనుండి దూరంగా జరిగి, నీతోపాటుతిరిగి కాశీ ప్రయాణం కట్టాను. జ్ఞాపకమే గదా

* * *

కొద్దిరోజుల్లోనే తన పెళ్ళి అయిందని విన్నాను. ఆస్తంతా అతని పేర వ్రాయించుకొన్నాడని కూడా విన్నాను. అప్పుడే అబిసీనియా అనే అమాయ కపు దేశంమీద, దాన్ని 'నాగరికం' చేయాలనే విపుల కుటిల సంకల్పంతో, ఇటలీ నియంత మసులోని, ఫిరంగులతోనూ విమాన దాడుల బాంబులతోనూ తలపడ్డాడు. మనం దినదినమూ చర్చించేవాళ్ళంగదా-ఫాసిజం అంటే ఏమిటి, హిట్లరు దురంతాలు ఎందులో భాగం? - అని మన "లా" కాలేజిలో గాయం మాన్పుకోటానికి ఎన్ని తంటాలు పడ్డాను? నీనుండి ఎంత దాచి పెట్టాను? గంగా నదిలో, నడిమధ్యదాకా యీదుకుంటూ, నీ వార్నింగుల్ని అలక్ష్యం చేస్తూ, తోసుకుపోయింది ఎందుకనుకొన్నావు? ఏదైనా మొసలివచ్చి పట్టుకుని భక్షిస్తే క్షోభను అంతం చేసుకోవచ్చుననే.

స్వేచ్ఛగా వలసపోవాల్సిన పక్షిజంటలో ఆడపక్షి ఇచ్ఛికంగా ఒక బంగారు పంజరంలో జొరబడ్డది-తన రక్త సంబంధీకుల క్షేమం కోసం. ఇప్పుడు ఏకాకి పథిక అయిన మగపిట్టగూడా, తనవాళ్ళను దుఃఖంలో చూడ జాలక యింకో పంజరంలోకి పోయింది నా పెళ్ళి పంజరం. నగిషీ పంజరం.

మరుపు పుటల పాడుబావిలో పడకముందే నీకోసంగతి చెప్పాలి. యశోద-తన ఆరుపేటల చంద్రహారాన్ని నాకు యిచ్చింది- ఆ చివరి కలయిక నాడే.

"నీ జ్ఞాపకానికా?" అని అడిగాను.

"నీ అధికారం చలాయించుకొన్నావు. నీ మీద నాకూ వుండాలి గదా అటువంటి అధికారం. తీసుకో"

ఇది రహస్యవాదులనబడే మిస్టిక్ కవుల పంక్తిగా అప్పటికీ యిప్పటికీ నాకర్థం కాలేదు. కాని - తామ్రపత్రాలు, మంత్రి పదవులూ, రాజకీయాధి కారాల పంపకాలు, పైరవీల సంపాదనా లేని పాతయుగం కదా అది. లాఠీ దెబ్బల గుర్తులు మాత్రమే మిగిల్చిన నాన్నగారి ఆస్తి, బజారున పడవలసిన కుటుంబ ఆర్థిక పరిస్థితుల్లో రెండోకంటికి తెలీకుండా తన హారాన్ని కుదువ బెట్టి గౌరవాన్ని నిలుపుకొంటానని ముందే వూహించిందా?

ఏమైతేనేం- కథ కంచికి పోలేదు. అనార్జితంగా సంక్రమించిన యశోద ఆస్తిని అనుభవించటం- వ్యసనాల ద్వారానే అని భావించాడు భర్త. కొడుకు పుట్టాడని విన్నాను, ఆస్తి కర్పూరహారతి అవుతున్న సంగతి మాత్రం వినలేదు.

సదాశివం మళ్ళీ సిగరెట్టు ముట్టిస్తుంటే వారించాలనిపించింది "ఏమీ తినకుండా వూది పారేస్తున్నావ్"

కొన్ని జీవితాలు గూడా ఇట్లా గాలిగా, పొగగా రసాయనిక పరిణామం చెందుతాయంటారు. మాణిక్యం గతించాక ఆమె వారసత్వంగా యశోదకు నల్లమందు సేవ అబ్బింది. నిస్సంతువుగా శపించబడ్డ నాకు అధిక ధనార్జన అనే మత్తుమందు అలవడ్డదని నీకు తెలుసు. నా భార్య సంస్కారం గురించి నీకు చెప్పటం అనవసరం అనుకుంటాను. నామత్తు అగాధలోకాల నుంచి పైకి లేపగల శక్తి ఆమెకు పుట్టుకతోనే లేదు. మా వివాహం నిర్ణయించినప్పుడు పురోహితులు శతృగణకూటమిని, షష్టాష్టకాలను పరిగణలోకి తీసుకొలేదేమో. నాన్నా, అమ్మా ఒకరితర్వాత ఒకరు గతించినపుడు నీవు యిచ్చిన తంతులు, వ్రాసిన వుత్తరాలు చదివివూరట పొందాను. కాని నేను యశోద జాబుకు ఎదురుచూశాను. నిజంగా, తెలిస్తే ఎందుకు వ్రాయలేదు? అని మధనపడ్డాను.

క్షయ రోగంతో మదనపల్లి నుండి రాజమండ్రి శానిటోరియంలోకి మారిందని నాకు తెలియదు. తన సంగతులేమీ తెలుసుకోవాలని ఎప్పుడూ ప్రయత్నించలేదు. కాని ప్రతిక్షణమూ నిరీక్షించాను.

నాగలింగం-ఆమె భర్త పేరు అదే-ఆస్తినంతా నాన్నాభ్రష్టు చేశాడు. చెల్లెళ్ళు బలవంతం చేస్తే కొంత పొలం తన స్వార్జితం లాగా వాళ్ళపేర వ్రాశాడు. ఇల్లుగూడా అమ్మివేశాడు - ఎవరికి? తాత అని చెప్పానే వాడికి. మిగతా ఆస్తి తాగుడుకూ పేకాటకూ ధారాదత్తం చేశాడు.

"యశోదకు మళ్ళీ బిడ్డలు లేరా?" అని ప్రశ్నించాను.

సిగరెట్టు ఆవల పారేస్తూ-"లేరు" అన్నాడు. ఎక్కడో పర్వత శిఖరాలమీద పుట్టిన సెలయేరు తనమీద ఒక్క నీడగూడా పడకుండా యోజనాలదూరం ప్రవహిస్తూ, అడవుల్లోకి అరణ్య గర్భాల్లోకి ప్రవేశించాక, ఆకూ అలముల్తో ఎండి పడిపోయిన వృక్షశాఖల్తో మలినమైపోయి తనే ఛాయగా మారిపోతే-యిక స్వచ్ఛజలం యివ్వగలదా?

భర్త చచ్చాక తనెక్కడ తలదాచుకొన్నదో తెలుసా, యశోద? మా పశువులకొట్టంలో. మా యిల్లు గ్రామ స్వరాజ్యాశ్రమంగా నాన్నగారే వ్రాసి యిచ్చారుగదా. ఒక అనాథ స్త్రీకి ఆశ్రయం కల్పించటానికి ఒక ధర్మకర్తగా నాకూ ఆశ్రమాధికారులు వ్రాశారు. ఆ అనాథ స్త్రీయే-యశోద. కాని యశోద చేతులు ముడుచుకు కూర్చొని కర్మబలాన్ని తిట్టుకుంటూ వుదాసీనత వహించలేదు. తన కొడుకుకోసం కోర్టులు తిరిగింది. రికార్డు చూస్తే ఆమె పట్టుదల అర్థమవుతుంది. స్త్రీ శక్తిగా పోరాడింది.

"మరిప్పుడు యశోద ఎక్కడున్నది?'' అని అడిగాను.

తన గుండెచూపి, వేళ్ళెత్తి ఆకాశంవేపూ చూపాడు.

"ఇంకో చోటగూడా....తన కొడుకులో"

''మరి....?''

''ఆ పిల్లవాడితో అన్నాను రికార్డంతా చదివి, పావరు దావా వెయ్యమని మీ అమ్మ చెప్పిందా?''

''చెప్పలేదు. చచ్చిపోయే రోజున మీకందించమని మాత్రమే చెప్పింది" అన్నాడు.

''మితాక్షరి మనుధర్మశాస్త్రం, హిందూ వారసత్వం నీకు నల్లేరు మీది బండినడక. అప్పీలు గెలిచావా?'' అని మూఢంగా ప్రశ్నించాను.

''సందేహం లేకుండా....బ్రదర్, సందేహం అదిగాదు. ఆ పిల్లవాడికి నే నేమని చెప్పాలి? నువ్వు నా రక్తానివి, నా కొడుకువి అని నిజం చెప్పనా?

చెప్పి తన తల్లిమీది అనన్య భక్తినీ, గౌరవాన్నీ త్రుంచివేయనా? లేక నా జీవితాంతం నాకున్న ఒక్క పుత్రుడినీ నా క్లైయింటుగానే పరిగణించనా?''

* * *

సదా కళ్ళనీళ్ళు యిదివరకెప్పుడూ చూడలేదు. మేము వాత్తేరుదాటాం. విజయవాడ సమీపంలో నేను దిగిపోవాలి. మద్రాసు వార్తాపత్రికల్ని అక్కడే కొన్నాం. ఒళ్ళు దుమ్ముతో పేరుకుపోయింది, చికాకుగానూ వుంది. ఆ చికాకు బొగ్గు ఇంజన్ ధూళివల్ల కలిగిందో, సదాశివుడి ధర్మసందేహ చింతనతో కలిగిందో చెప్పలేకున్నాను.

నేను పెట్టె సర్దుకొంటూంటే - ''మాట్లాడవేరా?'' అన్నాడు.

''సదా, అప్పుడూ యిప్పుడూ నీవు తాత్విక చింతన గలవాడివే. నన్ను పరీక్షించకు. నాతో యిక్కడే దిగు. నాలుగురోజులు రావని-మీ జోగారావుకూ వెంకటాచలానికి తంతి కొడతాను'' అని ఆప్యాయతతో అర్థించాను.

''కాదు, నీ టిక్కెట్టు ఎక్స్టెండు చేయిద్దాం నాతో మద్రాసురా. నా మూడో జూనియర్‌ని పరిచయం చేయాల్సి వుంది'' అన్నాడు.

''ఎవరా ఘనుడు?''

''ఎవరైతేనో నీకు పరిచయం చేస్తానంటావా? అతను....అతను.... యశోద కొడుకు. చదువు రానివాడని తల్లివలె మొదట భ్రమలో పెట్టాడు. నిజానికి అప్పటికి గ్రాడ్యుయేషన్ చేశాడు. మద్రాసులో ''లా'' పూర్తి చేశాడు''

''మరి అతనికి చెప్పావా?''

''చెప్పలేదు. యశోదమీద నిజానికి నాకే అధికారమూలేదు'' అన్నాడు.

నేను బండిదిగి పోయాను. ○

స్వాతి - జూన్ 87